నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

సమయపాలనమున సాపాటు చేసిన
రుగ్మతలునురావు ఋజువుగాను
ఇంటివంటకాలు ఒంటికి మంచిది
బయట తిండి మనకు వలదు వలదు

మీ
నలుమాసు విజయప్రసాద్
తెలుగు బోధకులు,కవి

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 198 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 27-10-2025 పేజీలు -8 | వెలః రూ. 5.00





# ఈ శతాబ్దం మనదే

- భారత్ – ఆసియాన్ బంధం దృఢమైనది
- వర్చువల్ ప్రసంగంలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ అక్టోబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్):** 21వ శతాబ్దం భారత్, ఆసియాన్‌దేనని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. భారత్, ఆసియాన్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం ప్రపంచ స్థిరత్వం, వృద్ధికి శక్తివంతమైన పునాదిగా అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం ప్రారంభమైన ఆసియాన్ (ఆగేయ ఆసియా దేశాల) సదస్సును ఉద్దేశించి ఆయన వర్చువల్‌గా

-మిగతా 2 లో




## దేశంలో 22ఫేక్ యూనివర్సిటీలు

- యూజీసీ హెచ్చరిక
- మోడీ సర్కార్ సైలెంట్ ఎందుకు? : విద్యార్థి సంఘాలు

**న్యూఢిల్లీ**

ప్రభుత్వపరంగా గుర్తింపు ఉన్న చదువులకు ప్రాధాన్యత దక్కటంలేదన్న ఆవేదన నిరుద్యోగుల్లో వ్యక్తమవుతోంది. మరోవైపు నకిలీ వర్సిటీలు పుట్టగోడుగుల్లా పుట్టుకోస్తున్నాయి. తాజాగా 22 ఫేక్ వర్సిటీలు ఉన్నాయని యూజీసీ ప్రకటించింది. వేలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుంటే.. కోట్లాది రూపాయలు దండుకుంటుంటే మోడీ సర్కార్ ఎందుకు గమ్మునుంటుం దనే చర్చ నడుస్తోంది. యూజీసీ కూడా కేవలం ఫేక్ వర్సిటీల వివరాలు ప్రకటించి చేతులు దులుపుకుంటుంటే.. దీని వెనుక రాజకీయ,ప్రభుత్వంలోని పెద్దలు, అధికారులకు ఎంతగా ముడుపులు అందుతున్నాయోనన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్న. నకిలీ వర్సిటీల చిట్టా..

-మిగతా 2 లో



## రాష్ట్రంలో రౌడీషీటర్ల పాలన నడుస్తోంది!

- రాష్ట్రాన్ని దోచుకుంటున్న రేవంత్‌రెడ్డి కుటుంబం, మంత్రులు: కేటీఆర్

**హైదరాబాద్,**

రాష్ట్రంలో రౌడీషీటర్ల పాలన నడుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబం, మంత్రులు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో హెూటల్స్ యూనియన్ కార్మిక నాయకులు పలువురు బీఆర్ఎసలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బ్రతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చిన కార్మికులను బీఆర్ఎస్ ఎటువంటి ఇబ్బంది కలిగించలేదన్న విషయాన్ని

-మిగతా 2 లో

# మూడు పార్టీల మధ్య మాటల యుద్ధం

**జూబ్లీహిల్స్‌లో ప్రచార జోరు**




- నియోజకవర్గంలో ఇంటింటికీ కాంగ్రెస్
- సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు
- సీటుపై బీజేపీ కన్ను

**హైదరాబాద్, అక్టోబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్):** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారం తారాస్థాయికి చేరింది. ప్రధాన రాజకీయ పక్షాలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ.. ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, ముమ్మర ప్రచారంలో నిమగమయ్యాయి. అగ్రనేతలు రంగంలోకి దిగి మాటల తూటాలు పేల్చుతుం డటంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. గడప గడపకూ తిరుగుతూ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు, నేతలు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. కాగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత ఆ పార్టీ తరపున, వి.నవీన్ యాదవ్ కాంగ్రెస్ అభ్యర్థిగా, లంకల దీపక్ రెడ్డి బీజేపీ నుంచి బరిలో

-మిగతా 2 లో



## నేడు సుప్రీంకోర్టులో పలు కేసుల విచారణ

- ఉమర్ సహా పలువురి బెయిల్ పిటిషన్లు

**న్యూఢిల్లీ**

: 2020 ఢిల్లీ అల్లర్ల కేసులో సామాజిక కార్యకర్తలు ఉమర్ ఖాలీద్, షార్జిల్ ఇమామ్, గుల్ఫిషా ఫాతిమా, మీరాన్ హైదర్‌ల బెయిల్ పిటిషన్లను సుప్రీంకోర్టు సోమవారం విచారించనుంది. జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్.వి. అంజరియాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్ లను విచారించే అవకాశం ఉంది. సెప్టెంబర్ 22న సుప్రీంకోర్టు ఢిల్లీ పోలీసులకు నోటీసు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఉమర్ ఖాలీద్ సహా పలువురు సామాజిక కార్యకర్తలు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌లపై స్పందించాలని పోలీసులను ఆదేశించింది. సామాజిక ప్రదర్శనలు, నిరసనల ముసుగులో కుట్రపూరిత హింసను అనుమ తించలేమని పేర్కొంటూ ఖాలీద్, ఇమామ్ సహా తొమ్మిది మందికి ఢిల్లీ హైకోర్టు బెయిల్ నిరాకరించింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ కార్యకర్తలు

-మిగతా 2 లో




## కేసీఆర్, బీఆర్ఎస్‌ను అంశాల వారీగానే విమర్శిస్తా

- వారు కాదనుకున్నాకే రాజీనామా చేశా
- మోసపూరిత వ్యక్తులదే పైచేయి అయ్యింది
- 'జూబ్లీహిల్స్'పై నిర్ణయం తీసుకోలేదు
- బీజేపీ ఎంపీలు రాజీనామా చేస్తే బీసీ బిల్లు అదే వస్తుంది: ఎమ్మెల్సీ కవిత

**నిజామాబాద్, అక్టోబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కొంతమంది కారణంగానే కేసీఆర్‌కు చెడ్డ పేరు వస్తోందని.. బీఆర్ఎసను, కేసీఆర్‌ను అంశాల వారీగా మాత్రమే విమర్శిస్తానని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలు ఎందుకు బయటకు వచ్చారో తనకు తెలియదని.. ఆ సమయంలో తాను జైల్లో ఉన్నానన్నారు. తాను బీఆర్ఎసలో ఉన్నప్పుడు ఎవరైనా ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉంటే వారితో మాట్లాడేదాన్నని.. వారిని పార్టీలోనే ఉంచే ప్రయత్నం చేసిన

-మిగతా 2 లో



## రష్యా చేతిలో అధునాతన క్షిపణి

- అణు శక్తితో అనంత దూరాలకు దూసుకెళ్లే బురే వెస్నిక్
- పరీక్షలో 15 గంటలపాటు 14 వేల కిలోమీటర్లకుపైగా ప్రయాణం
- ప్రపంచంలో మరే దేశం వద్దా ఇలాంటిది లేదన్న పుతిన్

**మాస్కో**

ప్రపంచంలోనే తొలిసారిగా.. అణు శక్తితో దూసుకెళ్లే క్రూయిజ్ క్షిపణిని రష్యా పరీక్షించింది! ప్రపంచంలో ఏ మూలనున్న లక్ష్యాన్నైనా ఛేదించే (అన్‌లిమిటెడ్ రేంజ్) సత్తా ఉన్న ఆ క్షిపణి పేరు.. '9ఎం730 బురే వెస్నిక్'. ఈ క్షిపణిని లాంచ్ చేయడానికి సంప్రదాయ ఇంజిన్‌నే వాడతారు. అనంతరం అందులోని చిన్న అణు రియాక్టర్ ఉత్తేజితమై.. దానికి 'దాదాపు అనంత దూరం' ప్రయాణించే శక్తినిస్తుంది! దీని తుది పరీక్షను ఆదివారం విజయవంతంగా నిర్వహించినట్టు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. "ప్రపంచంలో మరెవరి వద్దా లేని అద్భుతమైన సృష్టి ఇది" అని ఆయన సగర్వంగా పేర్కొన్నారు. ఈ క్షిపణిని రష్యా సాయుధ దళాల అమ్ములపొదిలో చేర్చేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని సైనికాధికారులను ఆదేశించారు. పరీక్షల్లో భాగంగా

-మిగతా 2 లో

## బస్సు ప్రమాద ఘటన మృతదేహాలు అప్పగింత

**అంబులెన్సులలో స్వగ్రామాలకు తరలింపు**



2 లో

# జూబ్లీహిల్స్‌లో ప్రచారానికి సీఎం రేవంత్

**రేపు యూస్ఫగూడ పోలీస్ గ్రౌండ్స్‌లో సభ**

- 30, 31న.. నవంబరు 4, 5 తేదీల్లో రోడ్‌షోలు!
- ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, అక్టోబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపించే బాధ్యతను భుజాన వేసుకున్న ఆయన.. స్వయంగా ప్రచారంలోకి దిగుతున్నారు. ఈ నియోజకవర్గం పరిధిలోని యూస్ఫగూడ పోలీసగ్రౌండ్స్‌లో ఈ నెల 28న తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్, 24 కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి అభినందన సభ జరగనుంది. ఆయనతో పాటు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావునూ సన్మానించనున్నారు. ఆ సభలో.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించనున్నట్లు సమాచారం. అలాగే ఈ నెల 30, 31 తేదీల్లోను మళ్లీ నవంబర్ 4, 5 తేదీల్లోనూ ఆయన

-మిగతా 2 లో

# ఎమ్మెల్యేలకూ డీసీసీ పదవులు!

**ఒకే కుటుంబంలో ఇద్దరికి పదవులూ తప్పు కాదు**



- అవసరమనుకున్న చోట ఇస్తాం
- సమన్వయ లోపంతోనే మంత్రుల మధ్య వివాదాలు
- కొండా సురేఖ కుమార్తె మాట్లాడిన విధానం ఆక్షేపణీయం
- కవిత యాత్రను స్వాగతిస్తున్నాం
- పదేళ్ల పాపపు పాలనలో ఆమె భాగస్వామ్యాన్ని ప్రశ్నిస్తున్నాం
- జూబ్లీహిల్స్‌లో గెలిచేది కాంగ్రెస్సే
- ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్ఠిలో పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్):** జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష (డీసీసీ) పదవులకు ఎమ్మెల్యేలకు కూడా పోటీ పడుతున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. అయితే స్థానిక పరిస్థితులను బట్టి వారికి ఆ పదవులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఇతర పదవుల్లో ఉన్నవారికి డీసీసీ అధ్యక్ష పదవులు ఇవ్వబోమని చెప్పిన విషయం వాస్తవమేనని, కానీ.. ఆ పరిధిలోకి ఎమ్మెల్యేలు రారని అన్నారు. అన్ని అర్హతలు ఉన్నవారికే అవకాశం వస్తుందని స్పష్టం చేశారు. ఆదివారం ఢిల్లీలో తెలంగాణ భవన్‌లో మీడియాతో మహేశ్‌గౌడ్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "డీసీసీ అధ్యక్ష పదవి కోసం ఐదుగురు ఎమ్మెల్యేలు పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ బలోపేతం కోసం అవసరమనుకున్న చోట ఎమ్మెల్యేలకు అవకాశం కల్పిస్తాం. వేరే పదవుల్లో

-మిగతా 2 లో

## ఈ శతాబ్దం మనదే

మొదటి తరువాయి

ప్రసంగించారు. '21వ శతాబ్దం మనదే. భారత్, ఆసియాన్ శతాబ్దమే. ఆసియాన్ కమ్యూనిటీ విజన్ 2045, వికసిత్ భారత్ 2047 లక్ష్యాలు మన మానవాళికి ఉజ్వల భవిష్యత్తును అందిస్తాయని విశ్వసిస్తున్నాను' అని చెప్పారు. ఆగేయాసియా, తూర్పు ఆసియా దేశాలతో సంబంధాలను విస్తరించుకునేందుకు భారత్ అవలంబిస్తున్న యాక్ట్ ఈస్ట్ విధానానికి ఆసియాన్ సదస్సు మూల స్తంభమని మోడీ తెలిపారు. భారత్, ఆసియాన్ వాణిజ్య భాగస్వాములు మాత్రమే కావని, అవి సాంస్కృతిక భాగస్వాములు కూడా అని చెప్పారు. 'ప్రపంచ జనాభాలో దాదాపుగా నాలుగో వంతుకు మనం ప్రాతినిధ్యం వహిస్తున్నాం. మనం కేవలం జనాభాను మాత్రమే పంచుకోవడం లేదు. సంస్కృతి, విలువలను కూడా గ్లోబల్ సౌత్‌లో మనం భాగస్వాములం' అని ఆయన అన్నారు. వివిధ అంశాలపై ఆసియాన్ దేశాలు కలసికట్టుగా పనిచేయాలని మోడీ సూచించారు. ఏ విపత్తులో అయినా ఆసియాన్ స్నేహితులకు అండగా ఉంటామని చెప్పారు. అది హెచ్ఎడిఆర్ కావచ్చు బ్లూ ఎకానమీ కావచ్చు సముద్ర భద్రత కావచ్చు భారత్ సహకారం వేగంగా పెరుగుతోందని తెలిపారు. 2026ను ఆసియాన్ %-% ఇండియా సముద్ర సహకార సంవత్సరంగా ప్రకటిస్తున్నామని అన్నారు. సదస్సును విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంను మోడీ అభినందించారు. తూర్పు తైమూరును ఆసియాన్ 11వ సభ్య దేశంగా చేర్చడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

## దేశంలో 22ఫేక్ యూనివర్సిటీలు

మొదటి తరువాయి

ఢిల్లీ కోట్లా ముబారక్‌పుర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఇంజినీరింగ్ సంస్థ విషయంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తాజాగా మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. అనుమతులు లేని డిగ్రీ కోర్సులను నిర్వహిస్తోందని పేర్కొంది. ఆ సంస్థ జారీ చేసే డిగ్రీలకు ఎలాంటి విలువ లేదని తెలిపింది. అసలు ఈ విశ్వవిద్యాలయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలకు సంబంధించి ఏ చట్టం కింద ప్రారంభించలేదని యూజీసీ స్పష్టం చేసింది. యూజీసీ డేటా ప్రకారం దేశంలో 22 గుర్తింపులేని యూనివర్సిటీలను నిర్వహిస్తున్నారని తేలింది. వీటిల్లో 9 దేశ రాజధాని ఢిల్లీలో ఉన్నాయి. ఐదు ఉత్తర్‌ప్రదేశ్‌లో ఉండగా.. మిగిలినవి కేరళ, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, పాండిచ్చేరిల్లో నిర్వహిస్తున్నట్టు యూజీసీ గణాంకాలు చెబుతున్నాయి.

**యూజీసీ వెల్లడి..**

ఢిల్లీలోని విద్యార్థులను బ్రోకర్ నెట్‌వర్క్‌లతో మాయచేసి.. ఈ విశ్వవిద్యాలయాలు ఆకర్షిస్తున్నాయి. తమ సంస్థలకు పేర్లు పెట్టే సమయంలో 'నేషనల్', టెక్నాలజీ, మేనేజ్‌మెంట్, ఇన్‌స్టిట్యూట్ వంటి పదాలు వాడుతున్నారు. ఇక యూపీలో విద్యాపథ్, పరిషద్, ఓపెన్ యూనివర్సిటీ వంటి పదాలను వినియోగిస్తున్నారు. విద్యార్థులు ఏదైనా సంస్థలో చేరే సమయంలో దాని పేరు సెక్షన్ 2(ఎఫ్) లేదా 3 కింద యూజీసీ గుర్తించిన జాబితాలో ఉందో లేదో చెక్ చేసుకోవాలి.

## రాష్ట్రంలో రౌడీషీటర్ల పాలన నడుస్తోంది!

మొదటి తరువాయి

గుర్తు చేశారు. మంత్రి ఓఎస్డీ తుపాకీతో బెదిరించారని మంత్రి ఇంటికి పోలీసులు వెళ్లారని.. ఆ సమయంలో మంత్రి కూతురు బయటకు వచ్చి తుపాకీ ఇచ్చిందే రేవంత్‌రెడ్డి అని చెప్పారని అన్నారు. మంత్రి భర్తే తుపాకీ ఇచ్చారని పోలీసులు అంటున్నారని చెప్పారు. అలీబాబా దొంగల ముఠా లాగా.. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన తయారయిందని కేటీఆర్ విమర్శించారు. లిక్కర్ బాటిళ్ల స్టిక్కర్ కాంట్రాక్టు కోసం సీఎం అల్లుడు, మంత్రి కొడుకు పోటీపడ్డారని.. ఈ వ్యవహారంలో ఎవరికీ చెప్పలేక ఓ ఐఏఎస్ అధికారి రాజీనామా చేశారని తెలిపారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో నేరచరిత్ర ఉన్న వాళ్లను, బెదిరింపులకు పాల్పడే వాళ్ళను గెలిపిస్తారా...? అని ప్రశ్నించారు. కాగా, జహీరాబాద్ మైనార్టీ గురుకులంలో చదివి వైద్య కళాశాలల్లో సీట్లు సాధించిన ఎంబీబీఎస్ విద్యార్థులను కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రి హరీశ్‌రావు సత్కరించారు. జహీరాబాద్ గురుకులం నుంచి మాత్రమే 16 మంది ఎంబీబీఎస్ సీట్లు సాధించడం అభినందనీయమన్నారు. కాగా, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29న అన్ని జిల్లాల కలెక్టరేట్లను ముట్టడించనున్నట్లు బీఆర్ఎసవిద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## నేడు సుప్రీంకోర్టులో పలు కేసుల విచారణ

మొదటి తరువాయి

సెప్టెంబర్ 2న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఖాలీద్, ఇమామ్‌లతో పాటు ఫాతిమా, హైదర్, మొహమ్మద్ సలీమ్‌ఖాన్, షిఫా ఉర్ రెహమాన్, అథర్ ఖాన్, అబ్దుల్ ఖాలీద్ సైఫీ, షాదాబ్ అహ్మద్‌లు బెయిల్ తిరస్కరణను ఎదుర్కొన్నారు. మరో కార్యకర్త తస్లీమ్ అహ్మద్ బెయిల్ పిటిషన్‌ను సెప్టెంబర్ 2న మరో హైకోర్టు బెంచ్ తిరస్కరించింది. 2020 ఫిబ్రవరి 20న ఢిల్లీ అల్లర్ల కేసులో సూత్రధారులు అని ఆరోపిస్తూ ఖాలీద్, ఇమామ్ సహా పలువురు కార్యకర్తలపై ఉపా, గతంలోని ఐపీసీ నిబంధనల కింద కేసు నమోదు చేయబడింది. వీరంతా అప్పటి నుంచి జైలులోనే ఉన్నారు.

## రష్యా చేతిలో అధునాతన క్షిపణి

మొదటి తరువాయి

అక్టోబరు 21న బురేవెస్ట్నిక్‌ను ప్రయోగించగా.. అది 15 గంటలపాటు 14 వేల కిలోమీటర్లకుపైగా దూరం ప్రయాణించిందని రష్యా మిలటరీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వెలెరీ గెరాసిమోవ్ తెలిపారు. 14 వేల కిలోమీటర్లు దాని గరిష్ఠ పరిధి కాదని.. బురేవెస్ట్నిక్ సాంకేతిక సామర్థ్యాలు ఎంత గొప్పవంటే ప్రపంచంలో ఎంత దూరంలో, ఎంత సురక్షిత ప్రదేశంలో ఉన్న లక్ష్యాన్నైనా అది గురితప్పకుండా ఛేదించగలదని ఆయన వివరించారు. రష్యా వద్ద ఇప్పటివరకూ ఉన్న క్రూయిజ్ క్షిపణుల్లో అత్యధిక రేంజ్ కలిగినది.. కేహెచ్-102 క్రూయిజ్ మిస్సైల్. దాని పరిధి 4500 కిలోమీటర్లు అంటే.. బురేవెస్ట్నిక్ సత్తా ఏమిటో అర్థం చేసుకోవచ్చు. అణు ఇంధనంతో నడిచే శక్తి, వార్‌హెడ్ సామర్థ్యాలను కలిగిన ఈ క్షిపణి గురించి పుతిన్ 2018లోనే ప్రపంచానికి తొలిసారి తెలియజేశారు. బురేవెస్ట్నిక్‌ను ఆయన అజేయమైన ఆయుధంగా అభివర్ణించారు. 50 నుంచి 100 మీటర్ల ఎత్తులో ప్రయాణించే ఈ క్రూయిజ్ క్షిపణిని గుర్తించి, అడ్డుకోవడం అత్యంత అధునాతనమైన క్షిపణి నిరోధక రక్షణ వ్యవస్థలకు సైతం చాలా కష్టమని వివరించారు.

## జూబ్లీహిల్స్‌లో ప్రచారానికి సీఎం రేవంత్

మొదటి తరువాయి

రోడ్‌షోలు నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. వీటికి మధ్యలో బిహార్ ఎన్నికల ప్రచారానికీ ఆయన వెళ్లనున్నట్లు చెబుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ 22 నెలల పాలనకు ఈ ఉప ఎన్నిక కొలమానంగా మారడం, ఇక్కడ గెలిస్తే దాని ప్రభావం జీహెచ్ఎంసీ ఎన్నికలపైనా పడే అవకాశమున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు.

# మూడు పార్టీల మధ్య మాటల యుద్ధం

మొదటి తరువాయి

ఉన్నారు. ఉప ఎన్నిక నవంబర్ 11న జరగనుంది.

### మూడు పార్టీల మధ్య నువ్వా..నేనా..?

ప్రధాన పార్టీల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, ప్రజలను మోసం చేసిందని ఆరోపిస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడించడం ద్వారానే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, ఇచ్చిన హామీలను అమలు చేసేలా చేయవచ్చని ప్రజలకు చెబుతున్నారు.

మరోవైపు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీజేపీ మధ్య రహస్య ఒప్పందం ఉందని ఆరోపించారు. ఈ రెండు పార్టీల కుట్ర రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తమను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎన్నిక రౌడీలకు, మహిళలకు మధ్య జరుగుతున్న పోరాటమని.. ఇందులో మహిళనే గెలవాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ మాటలతో ప్రచారాన్ని మరింత హీటెక్కించారు. బీజేపీ అగ్రనేత, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దశాబ్దాలుగా జూబ్లీహిల్స్‌ను నిర్లక్ష్యం చేశాయని విమర్శిస్తున్నారు. ఈ నియోజకవర్గాన్ని 'సమస్యల హిల్స్'గా మార్చారని ఆరోపించారు. కాంగ్రెస్, ఎంఐఎం పార్టీల మధ్య అవగాహన ఉందని, కాంగ్రెస్‌కు ఓటు వేస్తే అది ఎంఐఎంకు వేసినట్టేనని చెబుతున్నారు.

### రంగంలోకి అగ్రనేతలు

మూడు ప్రధాన పార్టీలు తమ అగ్రనేతలను ప్రచార బరిలోకి దింపాయి. బీఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు సహా 40 మంది స్టార్ క్యాంపెయినర్ల జాబితాను ఆ పార్టీ విడుదల చేయగా.. కేటీఆర్, హరీశ్ రావు వంటి నేతలు ఇప్పటికే డివిజన్ల వారీగా ప్రచార బాధ్యతలను పర్యవేక్షిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో 40 మంది స్టార్ క్యాంపెయినర్లను ప్రకటించగా.. మంత్రులు, సీనియర్ నేతలు డివిజన్ల వారీగా ప్రచార బాధ్యతలు చేపట్టారు. పొన్నం ప్రభాకర్, ఇతర నేతలు ఇప్పటికే డివిజన్ల వారీగా ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తూ.. ఓటర్లకు ప్రజాపాలన ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి.. అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ.. ఓట్లు అడుగుతున్నారు. ఇక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 28 నుంచి రోడ్ షోలు, బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. బీజేపీ తరపున కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రచార బాధ్యతలను ముందుండి నడిపిస్తున్నారు. ఆయనతో పాటు పలువురు రాష్ట్రస్థాయి నేతలు కూడా ప్రచారంలో పాల్గొంటున్నారు.

### గడప గడపకూ ప్రచారం

అభ్యర్థులు, పార్టీల నేతలు ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. కాంగ్రెస్ మంత్రులు, నేతలు డివిజన్ల వారీగా గడప గడపకూ తిరుగుతూ ప్రభుత్వ పథకాలను వివరిస్తున్నారు. బీఆర్ఎస్ నేతలు కూడా ఇంటింటికి వెళ్లి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, తమ అభ్యర్థిని గెలిపించాలని కోరుతున్నారు. బీజేపీ నేతలు సైతం, ముఖ్యంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బస్తీలలో పర్యటిస్తూ, స్థానిక సమస్యలను ప్రస్తావిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఉపఎన్నిక ఫలితం రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అందువల్ల మూడు పార్టీలు ఈ ఎన్నికను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని, విజయం కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నాయి.

# కేసీఆర్, బీఆర్ఎస్‌ను అంశాల వారీగానే విమర్శిస్తా

మొదటి తరువాయి

విషయాన్ని గుర్తు చేశారు. తన విషయంలో పార్టీ ఏకపక్ష నిర్ణయం తీసుకుందని.. అసలు తాను బయటకు రావాలని అనుకోలేదన్నారు. నిజామాబాద్‌లో జనంబాట కార్యక్రమంలో భాగంగా రెండో రోజు ఆదివారం ఓ హోటల్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. అనివార్య పరిస్థితుల్లోనే పార్టీ బయటకు వచ్చానని.. వారు కాదనుకున్న తర్వాతే రాజీనామా చేశానని తెలిపారు. పార్టీలో ఉండగా మాట్లాడాల్సిన అన్ని చోట్ల మాట్లాడానని.. కానీ పార్టీకి నష్టం చేసే, బాధ్యత మరిచిన మోసపూరిత వ్యక్తులదే పైచేయి అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. వాళ్ల కారణంగానే బీఆర్ఎస్, కేసీఆర్‌కు నష్టం జరగనుందన్నారు. ఐదేళ్ల క్రితమే ఎవరి పనితీరు ఏంటని తెలుసుకొని ఉంటే మొన్నటి ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయేది కాదని చెప్పారు. తాను బీఆర్ఎసలో తిరుగుబాటు చేయలేదని..అంత అవకాశమివ్వకుండానే బయటకు పంపారని చెప్పారు.

### నా బాధ చెబుతా.. వారి బాధ వింటా!

'నా బాధ ప్రజలకు చెబుతా.. వాళ్ల బాధ వింటా.. పరిష్కార మార్గానికి ప్రయత్నం చేస్తా..' అని కవిత అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నిక విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ఏ పార్టీకి ఓటేయాలన్నది స్థానిక జాగృతి కార్యకర్తలే నిర్ణయం తీసుకుంటారన్నారు. పార్టీ పెట్టుడు పెద్ద పని కాదని, కానీ పార్టీ కన్నా కూడా ప్రజల సమస్యలు తీరడం ముఖ్యమని చెప్పారు. కేసీఆరే తనతో పార్టీ పెట్టిస్తున్నారని వస్తున్న వార్తల్లో నిజం లేదని స్పష్టంచేశారు. కాంగ్రెస్ వాళ్లు తనకు మద్దతు తెలుపుతున్నారన్న దాంట్లో వాస్తవం లేదని.. వాళ్లకే ప్రజల్లో ఏ ఆదరణ లేదని ఎద్దేవా చేశారు. అనుకోకుండా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. దాన్ని కూడా కాపాడుకోలేకపోతోందని విమర్శించారు. స్థానిక ఎన్నికలు వచ్చినప్పుడు ఏం చేయాలన్న దానిపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రానికి చెందిన 8 మంది బీజేపీ ఎంపీలు రాజీనామా చేస్తే బీసీ బిల్లు నడుచుకుంటూ వస్తుందన్నారు. తాను జనంబాటకు వస్తున్నానని తెలిసి ఓ బీజేపీ ఎంపీ తన గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని.. ఆయన అవినీతిని త్వరలోనే బయటపెడతానన్నారు.

# ఎమ్మెల్యేలకూ డీసీసీ పదవులు!

మొదటి తరువాయి

ఉన్నవారైతే.. రాజీనామా చేయించి డీసీసీ అధ్యక్షుడిగా నియమిస్తాం. ఎమ్మెల్యేలకు డీసీసీ పదవులను డబుల్ పోస్టులుగా చూడటం లేదు. అలాగే, ఒకే కుటుంబంలో రెండు పదవులు తీసుకోవడంలో తప్పేమీ లేదు. ఏళ్ల తరబడి కాంగ్రెస్ కోసమే కష్టపడేవాళ్లు ఒకే కుటుంబంలో ఉండొచ్చు. అలాంటప్పుడు వాళ్లకు పదవులు వద్దని ఎలా అంటాం? కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి వంటి వాళ్ల ఇళ్లల్లో రెండు పదవులు వాళ్ల పనికి గుర్తింపుగా వచ్చినవే. ఉత్తమ్ పద్మావతి కూడా డీసీసీ పదవి కోసం దరఖాస్తు చేసినట్టు తెలిసింది. ఈసారి భారీ ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. కొన్ని జిల్లాల్లో ఏఐసీసీ పరిశీలకులు ఇచ్చిన పేర్లే కాకుండా.. సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్కతోపాటు నేను ఇచ్చిన పేర్లు వేరుగా ఉన్నాయి. అన్నింటినీ అధిష్ఠానం పరిశీలిస్తోంది. అవసరమనుకుంటే మళ్లీ నన్ను ఢిల్లీకి పిలవొచ్చు. లేదంటే.. వారం, పదిరోజుల్లో డీసీసీ అధ్యక్షుల పేర్లను అధిష్ఠానమే ప్రకటిస్తుంది" అని మహేశ్ గౌడ్ తెలిపారు.

### సమన్వయ లోపంతోనే వివాదాలు..




మంత్రుల మధ్య సమన్వయ లోపంతోనే వివాదాలు వస్తున్నాయని మహేశ్‌గౌడ్ అభిప్రాయ పడ్డారు. "మంత్రి కొండా సురేఖ దగ్గర పనిచేసిన సుమంత్ ఒక ఇంట్లోకి వెళ్లాడు. ఆయనను వెంబడిస్తూ పోలీసులు వెళ్లారు. అది మంత్రి అధికారిక నివాసం కాదు. ఇంతలోనే సురేఖ కుమార్తె కిందికి వచ్చి పానిక్ అయి అలా మాట్లాడారు. ఎవరు, ఎవరినైనా కులం పేరుతో విమర్శిస్తే ఊరుకోం. ఆమెను మందలించాం. అసలు.. ఆమె కాంగ్రెస్ పార్టీ సభ్యురాలు కాదు. పొన్నం ప్రభాకర్ విషయంలోనూ ఇటువంటిదే జరిగింది. ఇక జీవన్‌రెడ్డి శిష్యుడే అడ్లూరి లక్ష్మణ్. ఇవన్నీ.. సమన్వయలోపంతో వచ్చినవే. అన్నీ సద్దుమణిగాయి. కాంగ్రెస్ పార్టీలో ఓపికగా ఉంటేనే భవిష్యత్తు ఉంటుంది. కాంగ్రెసలో కార్యకర్త నుంచి మంత్రి వరకు ఎవరైనా పార్టీ నియమాలకు లోబడే ఉండాలి. నాతో సహా అందరం హైకమాండ్ రాడార్‌లో ఉన్నాం" అని పీసీసీ చీఫ్ అన్నారు. మంత్రుల మధ్య వివాదం హరీశ్‌రావు, కేటీఆర్‌లకు కోతికి కొబ్బరిచిప్ప దొరికినట్టే అయ్యిందన్నారు. ముందుగా వారి కుటుంబంలోని పంచాయితీని సరిదిద్దుకోవాలని హితవు పలికారు. క్యాబినెట్ భేటీలో మంత్రుల పనితీరు, సమన్వయలోపం వంటి అంశాలన్నింటిపైనా సీఎం రేవంత్‌రెడ్డి సూచనలు చేశారని తెలిపారు.

# బస్సు ప్రమాద ఘటన మృతదేహాలు అప్పగింత

### అంబులెన్సులలో స్వగ్రామాలకు తరలింపు

**కర్నూలు ప్రతినిధి/హాస్పిటల్**

కర్నూలు జిల్లా చిన్నటేకూరు సమీపంలో వేమూరి కావేరి బస్సు ప్రమాద ఘటనలో మృతదేహాలను బంధువులకు ఆదివారం అప్పగించారు. 18 మంది మృతుల బంధువుల నుంచి డిఎన్ఎ పరీక్షల కోసం రక్తనమూనాలు సేకరించగా, ఆదివారం ఉదయం ఈ రిపోర్టులు అందాయి. 18 మృతదేహాల డిఎన్ఎ నమూనాలు, బంధువుల డిఎన్ఎ నమూనాలతో సరిపోలడంతో కర్నూలు జిజిహెచ్ మార్చురీలో భద్రపరచిన 17 మంది మృతదేహాలను బంధువులకు అప్పగించారు. అంబులెన్సులు ఏర్పాటు చేసి వారి స్వగ్రామాలకు వాటిని తరలించారు. ఒడిశాకు చెందిన కె దీపక్ కుమార్ మృతదేహాన్ని బంధువులు సోమవారం వచ్చి తీసుకుంటామని చెప్పారు. బీహార్‌కు చెందిన అమ్రిత్ కుమార్ మృతదేహాన్ని తమ గ్రామానికి తీసుకెళ్లలేమని కుటుంబ సభ్యులు చెప్పడంతో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల సహకారంతో ఇక్కడే అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహాల అప్పగింత ప్రక్రియను కర్నూలు కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, ఎస్పి విక్రాంత్ పాటిల్ పర్యవేక్షించారు. కలెక్టర్ సిరి మాట్లాడుతూ మన రాష్ట్రానికి చెందిన మృతుల కుటుంబ సభ్యుల బ్యాంకు వివరాలు తీసుకుని ప్రభుత్వం ప్రకటించిన పరిహారాన్ని బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు.

### 19వ మృతుని గుర్తింపు

బస్సు ప్రమాద ఘటనలో 19వ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఆ మృతదేహం చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం యనగానిపల్లెకు చెందిన త్రిమూర్తి (52)గా నిర్ధారించారు. ఆదివారం ఉదయం మృతుడి కుమారుడి నుంచి రక్తనమూనాను సేకరించి డిఎన్ఎ పరీక్ష కోసం మంగళగిరి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. సోమవారం డిఎన్ఎ రిపోర్టు రానున్నట్లు అధికారులు చెబుతున్నారు.

### మృతి చెందిన బైకర్‌పై కేసు నమోదు

చిన్నటేకూరు వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన బైకర్ శివశంకర్‌పై ఉలిందకొండ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయన స్నేహితుడు ఎర్రి స్వామి ఫిర్యాదుతో బిఎన్ఎస్ 281, 125 (ఎ), 106 (1) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. తాను, శివశంకర్ మద్యం సేవించామని, మద్యం మత్తులో నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢకొట్టిందని, శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందాడని, తాను గాయపడి ప్రాణాలతో బయటపడ్డానని ఎర్రి స్వామి పోలీసులకు వివరించారు. శివశంకర్ మృతదేహంలో మద్యం ఆనవాళ్లు ఉన్నట్లు కర్నూలు ప్రాంతీయ ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికలో నిర్ధారణ అయిందని ఎస్పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. బస్సు డ్రైవర్ లక్ష్మయ్య మద్యం సేవించలేదని తేలిందని చెప్పారు.

## 2025 అక్టోబర్ 27, సోమవారం తెలుగు పంచాంగం




మాసం - పక్షం
కార్తీక మాసం
శుక్ల పక్షం
తిథి
సప్తమి: అక్టోబర్ 26 రాత్రి 10:03
అక్టోబర్ 27 రాత్రి 10:43 వరకు
అష్టమి: అక్టోబర్ 27 రాత్రి 10:43
అక్టోబర్ 28 రాత్రి 11:32 వరకు
నక్షత్రం
ఉత్తరాషాఢ: అక్టోబర్ 26 రాత్రి 8:18 అక్టోబర్ 27 రాత్రి 8:29 వరకు
శ్రవణం: అక్టోబర్ 27 రాత్రి 8:29 అక్టోబర్ 28 రాత్రి 8:48 వరకు
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:48 - 5:32
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:38 - 12:22
అమృతకాలం: రాత్రి 8:45 - 10:20
అశుభ సమయాలు
రాహుకాలం: ఉదయం 7:44 - 9:13
యమగండం: మధ్యాహ్నం 10:42- 12:11
దుర్ముహూర్తం: ఉదయం
8:06 - 8:54, మధ్యాహ్నం 12:22 - 1:10
వర్జ్యం: మధ్యాహ్నం 3:25- 5:05

# చటాన్ పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి మోక్షం

**-రూ. 34 కోట్ల నష్టపరిహారానికి గ్రీన్ సిగ్నల్**
**-రూ. 194 కోట్లతో నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం**



**షాద్ నగర్, అక్టోబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్):** షాద్ నగర్ పట్టణానికి ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న చటాన్ పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరో 20 రోజుల్లో రూ.194 కోట్ల నిధులతో వంతెన నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ వెల్లడించారు. ఆదివారం ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, బ్రిడ్జ్ నిర్మాణం విషయంలో గతంలో కొంత జాప్యం జరిగిన మాట వాస్తవమేనని, అయితే నష్టపరిహారం, డిజైన్ మార్పులు తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రజలకు ప్రయోజనం చేకూరేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. బ్రిడ్జ్ నిర్మాణం వల్ల నష్టపోయిన ప్రజలకు రూ.34 కోట్ల నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే శంకర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మండల పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు చెన్నయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, శ్రీను నాయక్, మహమ్మద్ ఇబ్రహీం, మాజీ కౌన్సిలర్ రాజేందర్ రెడ్డి, లింగారెడ్డిగూడెం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి నిధుల జాతర



**షాద్ నగర్, అక్టోబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్):** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి మహర్దశ ప్రారంభమైంది. ముఖ్యమైన గ్రామాలకు వెళ్లే రహదారులకు మోక్షం లభించనుందని, ప్రత్యేక నిధులతో వాటిని అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్ హెచ్ 44 నుంచి వీర్లపల్లి వరకు హెచ్ఎండిఏ నిధుల ద్వారా రూ.10 కోట్ల బీటీ డబుల్ రోడ్డు నిర్మాణం మంజూరయ్యిందని ఆయన వివరించారు. అలాగే కొత్తూరు నుండి మామిడిపల్లి వరకు రూ.30 కోట్లతో, నందిగామ నుంచి నర్సప్పగూడ మీదుగా చెగూరు వరకు రూ.15 కోట్లతో, హాజిపల్లి నుండి అయ్యవారి పల్లి వరకు రూ.14 కోట్లతో విస్తరణ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. కొందుర్గు నుండి కొల్లూరు మీదుగా నవాబ్ పేట వరకు రూ.18 కోట్లతో, కొత్తూరు నుండి కేశంపేట వరకు రూ.19 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం జరుగుతుందని వెల్లడించారు. ఈ పనులకు సంబంధించిన టెండర్లను ఇప్పటికే ఆహ్వానించినట్లు ఎమ్మెల్యే శంకర్ స్పష్టం చేశారు. ప్రజల ప్రయాణ సౌకర్యం, ప్రాంతీయ అభివృద్ధి దృష్ట్యా ఈ రహదారుల నిర్మాణం కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, మాజీ కౌన్సిలర్ రాజేందర్ రెడ్డి, మహమ్మద్ ఇబ్రహీం, చెంది తిరుపతి రెడ్డి, రఘునాయక్, శ్రీను నాయక్, లింగారెడ్డిగూడెం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# పతాంజలి యోగ సెంటర్ ప్రారంభం




**నందిగామ, అక్టోబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్)** రంగారెడ్డి జిల్లా నందిగామ మండల కేంద్రంలో ఆదివారం పతాంజలి యోగ సెంటర్ ఘనంగా ప్రారంభమైంది. మాజీ జడ్పీటీసీ ఈటె గణేష్ ఆధ్వర్యంలో స్కూల్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో యోగ గురువులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురువులైన సోమ శ్రీనివాస్ గుప్తా, యోగా ప్రబారీ కర్ణాకర్, రామయ్య, గవ్వయ్య, సూర్యప్రకాశ్, బి. కృష్ణ, డాక్టర్ రవి కుమార్, సునీల్ అగర్వాల్ తదితరులు యోగ సాధన ప్రాముఖ్యతను వివరించారు. ఆరోగ్య పరిరక్షణ, మానసిక శాంతి, శరీర ధృడత్వం కోసం యోగ సాధన అత్యవసరమని వారు పేర్కొన్నారు. పతాంజలి యోగ సెంటర్‌ను విజయవంతంగా నడిపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈటె గణేష్ పిలుపునిచ్చారు. సమాజ శ్రేయస్సు కోసం యోగం ఒక శక్తివంతమైన సాధనమని ఆయన అభిప్రాయపడ్డారు.

# ఇంద్రహిల్స్ కాలనీలో విషాదం

**-తపిమేస్త్రి వెంకటేష్ ప్రమాదవశాత్తు మృతి**
**- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరామర్శ**



**అల్విన్ కాలనీ,అక్టోబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్)** రంగారెడ్డి జిల్లా అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఇంద్రహిల్స్ కాలనీలో విషాద ఘటన చోటుచేసుకుంది. తపిమేస్త్రిగా పనిచేస్తున్న వెంకటేష్ (29) అనే యువకుడు నిర్మాణంలో ఉన్న బిల్డింగ్ పైనుండి ప్రమాదవశాత్తు పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ శ్రీ దొడ్ల వెంకటేష్ గౌడ్ హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పోలీస్ అధికారులతో, మీడియా ప్రతినిధులతో, కాలనీ ప్రజలతో మాట్లాడి మృతదేహాన్ని పంచనామా కోసం తరలించే చర్యలు చేపట్టారు.

# ఆడబిడ్డలకు అండగా ఉంటా:

**మాజీ ఎంపీపీ కుండే వెంకటేష్**
**-పుస్తె మెట్టెలు ద్వారా దాంపత్య జీవితానికి చిరస్మరణీయ కానుక**



**మహేశ్వరం, అక్టోబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్)** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని నందుపల్లి గ్రామానికి చెందిన సంగెం అమృత యాదయ్య కుమార్తె వివాహం సందర్భంగా ఆదివారం పెద్దపులి నాగారం గ్రామంలోని మాజీ ఎంపీపీ కుండే వెంకటేష్ ఫామ్ హౌస్‌లో పుస్తె మెట్టెలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ, ఆడబిడ్డల పెళ్లి అనేది కేవలం కుటుంబ వ్యవహారం మాత్రమే కాదు, సమాజం మొత్తం కలిసి అండగా నిలవాల్సిన సందర్భమని పేర్కొన్నారు. పెద్దపులి నాగారం, పడమటి తండా, నందుపల్లి, ఏనుగు చెరువు తండా సహా చుట్టుపక్కల గ్రామాల్లో ఎవరైనా ఆడబిడ్డ పెళ్లి చేసుకుంటే, తాను అండగా ఉంటానని, జీవితకాలం గుర్తుండిపోయే విధంగా పుస్తె మెట్టెలు అందజేస్తానని ఆయన హామీ ఇచ్చారు. తన చేతుల మీదుగా అందించే ఈ కానుక, ఆ దంపతుల దాంపత్య జీవితంలో ఓ మధుర జ్ఞాపకంగా నిలుస్తుందని ఆయన భావం వ్యక్తం చేశారు. ఆడబిడ్డల భవిష్యత్తు కోసం సమాజం ముందడుగు వేయాల్సిన అవసరం ఉందని, తాను ఎల్లప్పుడూ వారి పక్షాన నిలుస్తానని మాజీ ఎంపీపీ కుండే వెంకటేష్ స్పష్టం చేశారు.


## సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు చేసిన యువ నాయకుడు




**కడ్తాల్, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కడ్తాల్ మండలంలోని ఎక్కయిపల్లి గ్రామ బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు జెనిగల మహేష్ యాదవ్ తన సొంత ఖర్చుతో కర్కల్పాడు నుండి ఎక్కయిపల్లి వరకు రోడ్డు మరమ్మతులు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లు వాహనదారులకు ప్రమాదకరంగా మారుతున్నాయని గుర్తించి, జేసీబీ ద్వారా చెట్లను తొలగించారు. ఈ సందర్భంగా మహేష్ యాదవ్ మాట్లాడుతూ, ప్రజల ప్రయాణ భద్రత కోసం ప్రభుత్వం స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరారు. గ్రామస్తులు, యువత మహేష్ యాదవ్ సేవా కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బిక్షపతి, నరసింహ, సురేష్, చంటి, గణేష్, శేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# రావిర్యాల చెరువులో గుర్రపు డెక్క తొలగింపుకు మోక్షం

**కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఉన్నతాధికారులతో చర్చ**



**తుక్కుగూడ, అక్టోబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్)** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న రావిర్యాల పెద్ద చెరువులో గుర్రపు డెక్క సమస్యకు పరిష్కారం దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. హెచ్ఎండిఏ ఉన్నతాధికారులతో మాట్లాడిన మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్) చెరువులో డెక్క తొలగించాలని విజ్ఞప్తి చేశారు. చెరువులో గుర్రపు డెక్క విస్తరించడంతో మత్స్యకారులు, ముదిరాజులు చేపలు పట్టేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రావిర్యాల కాంగ్రెస్ నేతలు కేఎల్ఆర్ దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక మున్సిపల్ కమిషనర్ సహా ఉన్నతాధికారులతో సమావేశమైన కేఎల్ఆర్, వెంటనే క్లీనింగ్ చేపట్టాలని సూచించారు. చెరువును అభివృద్ధి చేస్తే పర్యాటకంగా మారుతుందని, పట్టణ ప్రజలకు వాకింగ్ ట్రాక్ సహా ఇతర సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. రావిర్యాల చెరువు కింద వేల ఎకరాల సాగు భూములు ఉండటంతో రైతులు, ముదిరాజులు, స్థానిక నాయకులు ఈ చర్యకు హర్షం వ్యక్తం చేశారు. గుర్రపు డెక్క తొలగించటం వల్ల చెరువుపై ఆధారపడి జీవించే వారికి ఆర్థికంగా ఉపశమనం కలుగుతుందని, అలాగే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు దోమల బెడద, దుర్గంధం తగ్గుతుందని తుక్కుగూడ మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు.

# జగిత్యాలలో మన్ కీ బాత్ వీక్షణ



**జగిత్యాల, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారతీయ జనతా పార్టీ జగిత్యాల పట్టణ శాఖ ఆధ్వర్యంలో 35వ వార్డులో మన్ కీ బాత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, ప్రధాన కార్యదర్శి ఆముదరాజు, లింగంపేట రాజన్న, కోశాధికారి మర్రి పెల్లి సాగర్, ఉపాధ్యక్షులు గాదాస్ రాజేందర్, కొప్పు భాస్కర్, ఇట్యాల రాము, కార్యదర్శి ముద్దం గంగారెడ్డి, గుండేటి గోపి తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపులి నాగారం గ్రామంలో ఘనంగా సదర్ పండుగ

## రాజకీయాలకు అతీతంగా యాదవుల ఐక్యతకు ప్రతిరూపంగా వేడుకలు

**మహేశ్వరం, అక్టోబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని పెద్దపులి నాగారం గ్రామంలో సదర్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. యాదవ కులస్తుల సంప్రదాయాన్ని ప్రతిబింబించే ఈ సమ్మేళనం రాజకీయాలకు అతీతంగా, సామాజిక ఐక్యతకు నిదర్శనంగా సాగింది.గ్రామ నాయకులు మాట్లాడుతూ, మాట ఇస్తే తప్పని నైజం యాదవ బిడ్డలది అని, వారు నీతి, నిజాయితీకి ప్రతిరూపంగా నిలుస్తారని ప్రశంసల జల్లు కురిపించారు. రాజకీయాలు శాశ్వతం కావని, అభివృద్ధి కోసం ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. సదర్ వేడుకలు కేవలం ఉత్సవంగా కాకుండా, యాదవుల సామాజిక




స్థైర్యానికి, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని వివాదాల జోలికి వెళ్లకుండా, ప్రణాళికాబద్ధంగా విజయవంతంగా నిర్వహించాలని కమిటీకి సూచనలు అందించారు. కొందరు నాయకులు హితవు పలుకుతూ, దుందుడుకు చర్యలు మంచిపద్ధతి కాదని పేర్కొన్నారు. యాదవ సోదరులు ఎవరికి వత్తాసు పలకకుండా, రాజకీయాలకు అతీతంగా, నిజాయితీగా నిలబడుతున్నారని గుర్తు చేశారు. "భగవంతుడు మాట ఇస్తే తప్పొచ్చేమో కానీ యాదవులు మాట ఇస్తే తప్పరు" అనే మాటను ఉదహరిస్తూ, గొల్ల కురువలను భగవంతునితో సమానంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ వార్డు మెంబర్లు, వివిధ సంఘాల నాయకులు, యువజన సంఘాలు, గ్రామ పెద్దలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని సదర్ పండుగను విజయవంతంగా నిర్వహించారు.

# వై.ఎన్.ఎస్. ఇండోర్ స్పోర్ట్స్ క్లబ్ ప్రారంభం

### కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో క్రీడాభివృద్ధికి మరో అడుగు



**దుండిగల్, అక్టోబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని చర్చి గాగిలాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వై.ఎన్.ఎస్. ఇండోర్ స్పోర్ట్స్ క్లబ్‌ను అక్టోబర్ 26న ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి, గౌరవ అతిథిగా డా. లక్ష్య నాయుడు హాజరయ్యారు.సీనియర్ కాంగ్రెస్ నాయకుడు థామస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ క్లబ్ ప్రారంభోత్సవం సందర్భంగా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, యువత శారీరక, మానసిక అభివృద్ధికి క్రీడలు ఎంతో అవసరమని, ఇలాంటి క్రీడా వేదికలు యువతను సానుకూల దిశగా నడిపిస్తాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో సీనియర్ నాయకులు సిద్దనోల సంజీవ రెడ్డి, అమరం ముత్యం రెడ్డి, దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు నవీన్ రెడ్డి, మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, బల్ రాజ్, ఎం.డి. నయీమ్ పాషా, ఏరువ సుధీర్ రెడ్డి, ఏరువ నవీన్ రెడ్డి, వై. థామస్ రెడ్డి, వై. రాజా రెడ్డి, ఏరువ శ్రీకర్ రెడ్డి, వై. స్లీవ్ రెడ్డి, వై. ప్రదీప్ రెడ్డి, జి. విజయ్ భాస్కర్ రెడ్డి, వై. సుజిత్, జి. ప్రదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి విరాళం

### దాతలు జాలే నరసింహారెడ్డి తిలక్ రెడ్డి.



**దేవరకొండ,అక్టోబర్ 26. (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
దేవరకొండ మండలంలోని గాజినగర్ ఉమ్మడి పంచాయతీ అయిన చింతచెట్టుతండా గ్రామంలో నాడు 2023 శాసన సభ ఎన్నికల్లో ఆ గ్రామ ప్రజలు మా ఊరి వెంకటేశ్వర స్వామి ఆలయానికి ప్రహరీగోడ కట్టాలని జాలే నరసింహ రెడ్డి, తిలక్ రెడ్డి లను కోరారు.నాడు ఇచ్చిన మాట ప్రకారం నేడు శ్రీశ్రీశ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం ప్రహరీగోడ కొరకు 5,60,000 రూ,, అక్షరాల ఐదు లక్షల అరవై వేల రూపాయలు విరాళం అందించి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చశారు.అనంతరం ఆ గ్రామ ప్రజలు మాట్లాడుతూ.. నాడు ఇచ్చిన మాట ప్రకారం నేడు ఆలయ ప్రహరీగోడ కొరకు ఐదు లక్షల అరవై వేల రూపాయలు విరాళం అందించి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జాలే బ్రదర్స్ నరసింహారెడ్డి తిలక్ రెడ్డి గార్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ వారికి ఎల్లవేళలా రుణపడి ఉంటామని తెలుపుతూ వారిపై వారి కుటుంబ సభ్యులపైన ఆ వెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మిలాల్, దాస్య, శ్రీను నాయక్, రవి, హరిసింగ్, సూర్య, శాంత్య, బావోజి, హేమానాయక్, రవి, దత్త, మరియు తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ కోర్టు తరలింపు పై పచ్చిమట్ల రవీందర్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

### -ప్రజల సౌకర్యం దృష్ట్యా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆలోచన చేయాలి



**హుస్నాబాద్, అక్టోబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్**
: హుస్నాబాద్ పట్టణ కోర్టు తరలింపు అంశంపై మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ గారు ఆలోచన చేయవలసిన అవసరం ఉందని బిఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ పేర్కొన్నారు. గతంలో ఎమ్మెల్యే సతీష్ బాబు హయాంలో హుస్నాబాద్ ఎమ్మార్వో, ఆర్డీవో కార్యాలయాలు కిషన్ నగర్ వద్ద నిర్మించడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు కోర్టును కూడా పట్టణానికి దూరంగా జిల్లల గడ్డ లేదా పందిళ్ళ వద్ద నిర్మించాలని ఆలోచన జరుగుతోందని, సబ్ కోర్ట్ నిర్మాణానికి స్థల పరిశీలన జరుగుతోందని సమాచారం. అయితే, హుస్నాబాద్ కోర్టు పరిధిలోనే ఒక ఎకరం 30 గుంటల భూమి అందుబాటులో ఉండగా, అదే స్థలంలో బహుళ అంతస్తుల భవనాలుగా కోర్టును నిర్మిస్తే పట్టణ ప్రజలకు, మండల గ్రామాల ప్రజలకు సులభంగా సేవలు అందుబాటులోకి వస్తాయని బిఎస్పీ పార్టీ అభిప్రాయపడుతోంది.ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లి, ప్రజల అవసరాలను పరిగణలోకి తీసుకొని తగిన నిర్ణయం తీసుకోవాలని పచ్చిమట్ల రవీందర్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ నాయకులు వెలుపుల రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నం అభివృద్ధే నా ధ్యేయం

### -ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి
### -చెరువు కట్ట సుందరీకరణపై అధికారులతో సమీక్ష
### - అభివృద్ధికి నూతన దిశ



**అబ్దుల్లాపూర్ మెట్టు, అక్టోబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఆర్&బీ కార్యాలయంలో ఇబ్రహీంపట్నం చెరువు కట్ట సుందరీకరణ పనులపై పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన, రానున్న రోజుల్లో చెరువు కట్ట రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని తెలిపారు.గత ప్రభుత్వ అవగాహనా రాహిత్యం వల్ల నియోజకవర్గ అభివృద్ధి?కపోయిందని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వందలాది కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని, చెరువు కట్టపై జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని వాటి నివారణకు త్వరలోనే మరోసారి అధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సమీక్ష సమావేశంలో రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, ఇరిగేషన్, ఆర్&బీ, హెచ్ఎండిఏ, మున్సిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు. అభివృద్ధి పనులు ప్రజల అవసరాలకు అనుగుణంగా, భద్రతా ప్రమాణాలతో సాగాలని ఎమ్మెల్యే సూచించారు.

# హుస్నాబాద్‌లో మన్ కీ బాత్ 127వ ఎపిసోడ్ వీక్షణ

### -కవ్వ రాంరెడ్డి నివాసంలో బీజేపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కార్యక్రమం



**హుస్నాబాద్, అక్టోబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హుస్నాబాద్ నియోజకవర్గంలోని మహ్మదాపూర్ గ్రామంలో మన్ కీ బాత్ కార్యక్రమం 127వ ఎపిసోడ్‌ను బీజేపీ నాయకులు మరియు కార్యకర్తలు ఘనంగా వీక్షించారు. హుస్నాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం కవ్వ రాంరెడ్డి నివాసంలో జరిగింది.మండల అధ్యక్షులు భూక్య సంపత్ నాయక్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రధానమంత్రి ప్రసంగాన్ని శ్రద్ధగా వినిపించారు. దేశ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలపై అవగాహన పెంచేలా మన్ కీ బాత్ కార్యక్రమం కొనసాగుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు.

# 24వ సారి రక్తదానం చేసిన యువకుడు పాలకుర్తి మహేష్

### పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో సేవా సంకల్పం



**ఎలిగేడు, అక్టోబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన యువకుడు పాలకుర్తి మహేష్, పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 24వ సారి రక్తదానం చేసి సేవా సంకల్పాన్ని చాటాడు.విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ జరిగిన ఈ కార్యక్రమంలో మహేష్ రక్తదానం చేయడం స్థానికంగా ప్రశంసలందుకుంది. సమాజంలో శాంతి, భద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలను గౌరవించడంలో భాగంగా మహేష్ చేసిన ఈ రక్తదానం ఉదాహరణగా నిలిచింది. ఈ సందర్భంగా సిఐ సుబ్బారెడ్డి, ఎస్సైలు శ్రావణ్ కుమార్, సనత్ కుమార్ రెడ్డి మహేష్‌ను అభినందించారు. పలువురు అధికారులు, స్థానికులు కూడా మహేష్ సేవా భావాన్ని ప్రశంసిస్తూ, యువతలో ఇలాంటి చైతన్యం పెరగాలని ఆకాంక్షించారు.



**కరీంనగర్: అక్టోబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
భగత్ నగర్ లోని పెద్దమ్మ టెంపుల్ రోడ్డు లో నూతనంగా ఏర్పాటుచేసిన కస్తూరి మార్ట్ ను ప్రారంభించిన మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు.

# అర్బన్ బ్యాంక్ ప్యానల్ గెలుపు కోసం వెలిచాల రాజేందర్ రావు ప్రచారం




**కరీంనగర్, అక్టోబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ అంబేద్కర్ స్టేడియం, ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో ఆదివారం అర్బన్ బ్యాంక్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పాల్గొన్నారు. నవంబర్ 1న జరగనున్న ఎన్నికల్లో తమ ప్యానల్ అభ్యర్థులకు పట్టం కట్టాలని, అవినీతి రహిత పాలనకు ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు ఆశీస్సులతో ముందుకు వస్తున్న తమ ప్యానల్ అభ్యర్థులు బ్యాంకును అభివృద్ధి బాటలో నడిపిస్తారని, డిపాజిట్లను మూడింతలు పెంచేలా, డిజిటలైజేషన్ ద్వారా ఖాతాదారులకు సౌకర్యాలు కల్పించేలా పని చేస్తామని రాజేందర్ రావు హామీ ఇచ్చారు. గతంలో వచ్చిన అవినీతి ఆరోపణలకు మచ్చ లేకుండా బ్యాంకును సంస్కరిస్తామని తెలిపారు.ఈ ప్రచారంలో ప్యానల్ అభ్యర్థులు మూల వెంకట రవీందర్ రెడ్డి, ఇ. లక్ష్మణ్ రాజు, అనురాసు కుమార్, వజీర్ అహ్మద్, ఉయ్యాల ఆనందం, చిందం శ్రీనివాస్, నార్ల శ్రీనివాస్, మన్నె అనంత రాజు, మునిఫల్లి ఫణిత, దామెర శ్రీలత రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు ప్రకటించారు.

# వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఘన సన్మానం



**కరీంనగర్, అక్టోబర్ 26(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ రాష్ట్ర ఆప్తాలమిక్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించబడింది. హైదరాబాద్‌లోని ఐఎంఏ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ రవినాయక్ నేతృత్వంలో మోతీలాల్ జెడి, కళావతి జెడి, గర్లను ఘనంగా సన్మానించారు.వైద్య రంగంలో విశేష సేవలందించిన అధికారులను గుర్తించి, ప్రజాసేవకు ప్రోత్సాహం కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించబడిందని నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర బ్యులు పర్వతగిరి ప్రసాద్, ప్రవీణ్, శివ, లింబాద్రి, రమేష్ తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు. కరీంనగర్ నుండి జక్కుల జగన్మోహన్, గడ్డం ఓంప్రకాష్ కూడా హాజరై, సన్మానితుల సేవలను ప్రశంసించారు.

# ఏసీబీ వలలో జిల్లా అధికారి

## మంచిర్యాలలో రెండు లక్షల రూపాయల లంచం తీసుకుంటుండగా అరెస్ట్



**మంచిర్యాల, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు జిల్లా సహకార శాఖ అధికారి రాథోడ్ బిక్కు నాయక్‌ను లంచం తీసుకుంటూ రంగే హస్తంగా పట్టుకున్నారు. మంచిర్యాల కేంద్రంలోని ఇక్బాల్ అహ్మద్ నగర్‌లోని ఆయన నివాసంలో 2 లక్షల లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ బృందం దాడి చేసి అరెస్ట్ చేసింది.సస్పెండ్ అయిన ఉద్యోగికి పెరిగిన వేతనాలు మంజూరు చేయడానికి మొత్తం 7 లక్షలు లంచం డిమాండ్ చేసిన బిక్కు నాయక్, తొలి విడతగా 2 లక్షలు తీసుకునే సమయంలో వలపన్ని పట్టుబడ్డారు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో, ముందస్తు ప్రణాళిక ప్రకారం అధికారులు చర్యలు చేపట్టారు.

# కరీంనగర్‌లో నెలవారీ నేర సమీక్ష

## సీపీ గౌష్ ఆలం కీలక సూచనలు




**కరీంనగర్, అక్టోబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్, కమిషనరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. పిటిషన్ల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు స్టేషన్ల పర్యవేక్షణను పెంచాలని, ఎస్‌హెచ్‌ఓలు స్టేషన్ పరిశుభ్రత, రికార్డు నిర్వహణపై దృష్టి పెట్టాలని సూచించారు.రౌడీ షీటర్లు, మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, గంజాయి నిర్మూలనకు యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని, సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని ఆదేశించారు. ట్రాఫిక్ ప్రమాద నివారణకు బ్లాక్ స్పాట్స్ గుర్తించి చర్యలు తీసుకోవాలని, కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు.సమీక్షలో అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# నేడు ప్రజావాణి కార్యక్రమం రద్దు

## ఆడిటోరియంలో మద్యం దుకాణాల టెండర్ డ్రా కారణంగా సోమవారం ప్రజావాణి నిలిపివేత



**కరీంనగర్, అక్టోబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం నేడు రద్దు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు.ఆడిటోరియంలో మద్యం దుకాణాల టెండర్ డ్రా నిర్వహించనున్న నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ వారం నిర్వహించలేమని ఆమె పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, తదుపరి తేదీపై సమాచారం త్వరలోనే అందించబడుతుందని కలెక్టర్ సూచించారు.

# ఏదుల రిజర్వాయర్ సబ్ కాంట్రాక్టర్ దౌర్జన్యం

## - రైతు ఆత్మహత్య



**వనపర్తి అక్టోబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా జరుగుతున్న ఏదుల రిజర్వాయర్ పనుల్లో దౌర్జన్యం చోటుచేసుకుంది. భారీ వాహనాలతో పంట పొలం ధ్వంసం చేయడంతో మనస్థాపానికి గురైన రైతు ఆత్మహత్యకు పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది. ఏదుల మండల పరిధిలోని రిజర్వాయర్ నిర్మాణ పనులను ఎం ఎన్ ఆర్ సంస్థ చేపట్టి, రివిట్‌మెంట్ మరియు రోడ్డు నిర్మాణ పనులను ఏదుల గ్రామానికి చెందిన సబ్ కాంట్రాక్టర్ శ్రీనివాస్ రెడ్డికి అప్పగించింది. ఈ పనులలో భాగంగా భారీ వాహనాలను రోజూ రైతు కొమ్ము ఆంజనేయులు పంట పొలం గుండా నడపడంతో పంట పూర్తిగా నాశనమైంది. దీనిపై రైతు ప్రశ్నించగా, సబ్ కాంట్రాక్టర్ ప్రభుత్వం పనులకు అడ్డుగా వ్యవహరిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుతో మనస్థాపానికి గురైన ఆంజనేయులు పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మరణించారు. రైతు మరణంతో ఆగ్రహించిన ఏదుల గ్రామ ప్రజలు మృతదేహంతో ధర్నాకు దిగారు. ధర్నాకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ, మాజీ జడ్పీ చైర్మన్ రాకాసి లోకనాథ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, కార్యదర్శి మనివర్ధన్, మండల అధ్యక్షుడు రాము యాదవ్ తదితరులు మద్దతుగా చేరారు. రైతు మరణానికి కారణమైన సబ్ కాంట్రాక్టర్ శ్రీనివాస్ రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్ చేయాలని, మృతుడి కుటుంబానికి 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని నాయకులు డిమాండ్ చేశారు. పోలీసులు శ్రీనివాస్ రెడ్డి ప్రస్తుతం గోపాల్పేట పోలీస్ స్టేషన్‌లో కస్టడీలో ఉన్నాడని, విచారణ అనంతరం రిమాండ్ చేస్తామని తెలిపారు. ఇదే సమయంలో ఎమ్ ఎన్ ఆర్ సంస్థ ప్రతినిధులు రైతు కుటుంబానికి 10 లక్షల పరిహారం చెల్లించేందుకు అంగీకరించారు. పోలీసు హామీతో గ్రామస్తులు ధర్నా విరమించి మృతదేహాన్ని దహనం చేశారు.కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సెలవు రోజున పాఠశాల నడుపుతున్న ఫండస్ స్కూల్‌పై ఎస్ఎఫ్ఐ ఆందోళన




**కరీంనగర్, అక్టోబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ పట్టణంలోని ఫండస్ పాఠశాల సెలవు రోజున తరగతులు నిర్వహిస్తున్నదని ఆరోపిస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్కూల్ ముందు ధర్నా జరిగింది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. విద్యార్థులను బెదిరిస్తూ ఫైన్ వేస్తున్నారని, మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అరవింద్, వినయ్ సాగర్, ఆకాష్, రాకేష్, సందేశ్ తదితరులు పాల్గొన్నారు.

# రెవరెండ్ ఫాదర్ సన్మాన కార్యక్రమం



**ఎలిగేడు, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హైదరాబాద్ డయోసెస్‌లో హిస్ హోలీనెస్ మోర్ అండ్ మోర్ సామ్యూల్ తీయోపిలస్ మెట్రోపోలిటన్ ద్వారా రెవరెండ్ ఫాదర్‌గా అభిషేకించబడి వచ్చిన రెవ. ఫాదర్ యం. సురేష్ బాబును ఎలిగేడు సేంట్ థామస్ బిలీవర్స్ ఇస్ట్రాన్ చర్చ్‌కి చెందిన స్థానిక విశ్వాసులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ వైస్ ఎంపీపీ బుర్ర వీరస్వామి గౌడ్, అనిల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు. విశ్వాసులుగా వెంకటేష్, మహేష్, సమ్మయ్య, రవి, పెద్ద కుమార్, రాజేశామ్, గణేష్, మహేందర్, సురేందర్, నరేష్ తదితరులు హాజరయ్యారు.

# జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు ఆరంభం



**అచ్చంపేట, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణ కేంద్రంలో జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు ఆదివారం ఉదయం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్ పాల్గొని పోటీలకు ప్రారంభ ఘట్టాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైక్లింగ్ పోటీలు యువతలో ఆరోగ్యవంతమైన జీవనశైలి, క్రీడా చైతన్యాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని నాయకులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ అచ్చంపేట తాలూకా అధ్యక్షుడు లడ్డు యాదవ్, సాయి నగర్ కౌన్సిలర్ బాలరాజు, కాంగ్రెస్ నాయకులు లింగం తదితరులు పాల్గొన్నారు.పోటీలకు యువత నుంచి విశేష స్పందన లభించగా, విజేతలకు బహుమతులు అందజేయడం జరిగింది.

# బీఆర్ఎస్ నుండి బీజేపీలోకి చేరిన నాయకులు



**అమ్రాబాద్, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అమ్రాబాద్ మండలంలోని మున్ననూర్ గ్రామం, ప్రశాంత్ నగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు వరుణ్ అరవింద్, అంజి ఉదయ్ తదితరులు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్ సమక్షంలో బీజేపీలో చేరారు. గువ్వల బాలరాజ్ కండువాలు కప్పి వారికి స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గంగిశెట్టి నాగరాజు, మండల అధ్యక్షులు బొడ్డుపల్లి శ్రీనివాస్, జిల్లా నాయకులు గోలి రాజు, నోముల శంకర్ గౌడ్, శంకర్ మాదిగ, పగిడి పాల అనిల్, నోముల పరమేష్ గౌడ్, రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కి అనూహ్య స్పందన



**వనపర్తి, అక్టోబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జూబ్లీహిల్స్ బైఎలక్షన్ ప్రచారంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పర్యటనకు విశేష స్పందన లభించింది. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం కోసం మేఘారెడ్డి ప్రజలను "చేతి గుర్తుపై ఓటు వేసి గెలిపించండి" అని పిలుపునిచ్చారు. ఆదివారం ఎర్రగడ్డ బూత్ నం.384, శంకర్‌లాల్ నగర్‌లో ఆయన ప్రచారం నిర్వహించగా, ఓటర్లు నవీన్ యాదవ్‌కే ఓటేస్తామని భరోసా ఇచ్చారు. ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉమామహేశ్వర క్షేత్రం దర్శించిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



**అచ్చంపేట,అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అచ్చంపేట మండలం రంగాపురం గ్రామానికి దగ్గరలో ఉమా మహేశ్వర దేవస్థానాన్ని ఆదివారం నాడు మాజీ ఎమ్మెల్యే డా. గువ్వల బాలరాజు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు వేముల నరేందర్ రావు , శ్రీశైలం దేవస్థానం బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు , బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు కట్ట సుధాకర్ రెడ్డి , బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సోలంకి శ్రీనివాస్, బీజేపీ నాయకులు మంగ్య నాయక్ , బాలాజీ, నాగేంద్ర గౌడ్ , జానకి , వరికుప్పల ఆంజనేయులు, శంకర్ , మహేందర్, శ్రీనివాస్ గౌడ్, కాట్రావత్ జ్యోతి తదితరులు దర్శించుకున్నారు.

## మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**సిద్దిపేట, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అర్బన్ మండలం కెసిఆర్ గురుకుల పాఠశాలనగర్‌లో గల మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ బాలుర గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. కలెక్టర్ అన్ని రిజిస్టర్లను పరిశీలించి, కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులకు రుచికరంగా, పోషకాహారంతో కూడిన భోజనం అందించాలన్నారు. వంటగది పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, స్టోర్‌రూమ్‌లో ఉన్న కూరగాయలు, ఇతర సరుకులను పరిశీలించి, ఎల్లప్పుడూ వంటగది శుభ్రంగా, పొడి వాతావరణంలో ఉండేలా చూడాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పర్యవేక్షించాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు.

## ఇసుక ట్రాక్టర్ సీజ్

### డ్రైవర్, యజమానిపై కేసు నమోదు



**రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇల్లంతకుంట పోలీస్ సిబ్బంది శనివారం వాహనాల తనిఖీల్లో భాగంగా కందికట్కూరు గ్రామం వైపు నుండి వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. స్థానిక తహసీల్దార్ అనుమతితో ఇసుక రవాణా జరుగుతున్నప్పటికీ, అనుమతిలో పేర్కొన్న ప్రాంతానికి భిన్నంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో ట్రాక్టర్ డ్రైవర్ పబ్బతి శ్రీనివాస్, యజమాని దొమ్మటి అజయ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఘటనపై విచారణ కొనసాగుతోంది.

## లక్కీడ్రా కు వేళాయె , లక్కు ఎవరిని వివరించనుందో...!



**నల్లగొండ ,అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కొత్త మద్యం పాలసీ నిర్వహణకు వేళైంది. ప్రభుత్వం గత నెల 26 నుంచి ఈ నెల 23వరకు మద్యం టెండర్ల దరఖాస్తులు స్వీకరించింది. జిల్లాలో 154 మద్యం దుకాణాలకు 4,906 దరఖాస్తులు వచ్చాయి. లక్కీడ్రా పద్ధతిలో సోమవారం షాపులు కేటాయించనున్నారు. ఇందుకు నల్గొండ లోని లక్ష్మీ గార్డెన్స్ లో ఉదయం 10:00 నుండి డ్రా తీయనున్నట్లు డ్రా సమయానికి ముందు మాత్రమే మీడియాకు అనుమతుందని డ్రా సమయంలో మీడియాకు అనుమతించకుండా డ్రా అనంతరం వివరాలు అందిస్తామని తెలిపారు డ్రా ఏర్పాట్లను జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి సంతోష్ ఆదివారం పరిశీలించారు.

## వనభోజనాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఎచ్ఎంటీ శివాలయం దేవస్థానంలో వివిఎంఆర్ కాపు సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వనభోజనాల్లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనతో పాటు మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం మాట్లాడుతూ, "తెలంగాణలో అన్నికులాల వారు ప్రతి సంవత్సరం కార్తీకమాసంలో వనభోజనాలకు వెళ్ళడం ఒక సంప్రదాయంగా కొనసాగుతోంది. ఇది సామాజిక ఐక్యతకు, ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీక" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిఎంఆర్ కాపు సేవ సమితి అధ్యక్షుడు మూర్తి, కోటేశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట కోటేశ్వర్ రావు, మల్లారెడ్డి, ఎం.ఎస్. వాసు, వెంకట రాఘవ రావు, ఉపాధ్యక్షుడు నాగకిషోర్ తదితరులు పాల్గొన్నారు. వనభోజనాలు స్నేహభావాన్ని పెంపొందించేలా, ఉత్సాహభరితంగా సాగాయి.

# విద్యా, వైద్య సంస్థలపై కలెక్టర్ హైమావతి ఆకస్మిక తనిఖీలు

### పరీక్షా కేంద్రం, బాలికల విద్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శించిన జిల్లా కలెక్టర్



**సిద్దిపేట, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** లైసెన్స్ సర్వేయర్ స్పెల్-2 పరీక్షలు ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించామని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, నిర్వహణ తీరును పర్యవేక్షించారు. ఉదయం 10:00 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు, మధ్యాహ్నం 2:00 నుంచి సాయంత్రం 5:00 వరకు జరిగిన రెండు సెషన్లలో 153 మంది అప్లై చేసుకోగా 130 మంది హాజరయ్యారని, 23 మంది గైర్హాజరయ్యారని వివరించారు. ఈ సందర్భనలో కలెక్టర్ వెంట ఏడి సర్వే ల్యాండ్ వినయ్ కుమార్, కళాశాల సిబ్బంది ఉన్నారు.

**కస్తూరిబా బాలికల విద్యాలయంలో ఆహార తనిఖీ**

చిన్నకోడూర్ మండలంలోని అల్లీపూర్ గ్రామంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. వంటగదిలో రాత్రి భోజనానికి అందిస్తున్న అన్నం, మిల్మీకర్ కూర, టమాటా చట్నీ, సాంబారు, పెరుగు వంటి పదార్థాలను తనిఖీ చేశారు. హాజరు ప్రకారం సరుకులు అందిస్తున్నారా, బియ్యం నాణ్యత ఎలా ఉందని ఆరా తీశారు. కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులకు రుచికరంగా వండాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు వడ్డించే ప్రక్రియను పరిశీలించి, "బాగా తినాలి, శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలి" అని సూచించారు. విద్యా లక్ష్యాలపై రాజీపడకుండా శ్రమించాలని విద్యార్థులకు సూచించారు. విద్యాలయ ప్రాంగణంలో వెలుతురు తక్కువగా ఉండటాన్ని గమనించి, విద్యుత్ శాఖ ఏఈకి ఫోన్ ద్వారా ఎక్కువ వెలుతురు వచ్చే లైట్లు అమర్చాలని ఆదేశించారు.

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధుల తనిఖీ**

అనంతరం చిన్నకోడూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. అటెండెన్స్, ఓపి రిజిస్టర్‌ను పరిశీలించి, రాత్రి సమయంలో విధులు సక్రమంగా నిర్వహించాలని, 24/7 ఆసుపత్రిగా అత్యవసర వైద్య సేవలు అందించాలని ఏంపిఎచ్ఏ సాయమ్మ, అటెండర్‌ను ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 108 అంబులెన్స్ సిబ్బందితో మాట్లాడి, అత్యవసర సేవలకు వెంటనే స్పందించాలని సూచించారు.

# కమాన్‌పూర్‌లో ఉచిత న్యాచురోపతి

- ఆయుర్వేద వైద్య శిబిరం
-ప్రజల ఆరోగ్య రక్షణే మా లక్ష్యం
-డా. శరణ్య యాదవ్



**కమాన్‌పూర్, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సెంటినరీ కాలనీ డాక్టర్ శరణ్య ప్రకృతి వైద్యం హెల్త్ కేర్ సెంటర్ వద్ద ఉచిత న్యాచురోపతి మరియు ఆయుర్వేద వైద్య శిబిరం ఘనంగా నిర్వహించబడింది. ప్రకృతి వైద్య నిపుణురాలు డా. శరణ్య యాదవ్ ఆధ్వర్యంలో, నొప్పి నిర్వహణ నిపుణులు డా. శ్రీనివాస్ సారథ్యంలో, లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ సహకారంతో ఈ శిబిరం నిర్వహించబడింది. శిబిరంలో తొలిరోజు సుమారు 50 మంది రోగులకు ఉచిత వైద్య సలహాలు, చికిత్సలు, ఆయుర్వేద మందులు అందించబడ్డాయి. నడుం, మోకాలి నొప్పులు, మైగ్రేన్, సైనస్, చర్మ వ్యాధులు, డయాబెటిస్, రక్తపోటు వంటి సమస్యలపై న్యాచురోపతి పద్ధతుల్లో చికిత్సలు అందించారు. డా. శరణ్య మాట్లాడుతూ, "ప్రకృతి వైద్యం అనేది జీవనశైలి. సహజ ఆహారం, యోగా, ధ్యానం, సూర్యస్నానం ద్వారా శరీర స్వీయ నయం శక్తిని పెంపొందించవచ్చు" అని తెలిపారు. డా. శ్రీనివాస్ మాట్లాడుతూ, "మందులపై ఆధారపడకుండా ప్రకృతి చికిత్స ద్వారా మసిల్, జాయింట్, స్పైన్ సమస్యలకు ఉపశమనం పొందవచ్చు" అని వివరించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ, "ఇలాంటి ఆరోగ్య శిబిరాలు సామాజిక సేవలో భాగంగా ప్రజలకు ఎంతో మేలు చేస్తాయి. నిరంతరం కొనసాగిస్తాం" అని తెలిపారు. రేపు మరో 50 మంది రోగులకు ఉచిత చికిత్స, మందులు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్ క్లబ్ డైరెక్టర్, మాజీ జెడ్పిటిసి గంట వెంకటరమణారెడ్డి, టీవీ సురేష్ బాబు, వైద్య సిబ్బంది చక్రవర్తి, పుదరి రాజు, సారిక, రమ్య, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలపై నిరంతర పోరాటం

- టిడబ్ల్యూజెఎఫ్ ఆమనగల్ బ్లాక్ అధ్యక్షుడు దరువుల శంకర్
-అక్రిడేషన్, హెల్త్ కార్డు, ఇండ్ల ప్లాట్ల కోసం ఉద్యమం కొనసాగుతుంది



**ఆమనగల్, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతామని తెలంగాణా జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్) ఆమనగల్ బ్లాక్ అధ్యక్షుడు దరువుల శంకర్ తెలిపారు. ఆదివారం పట్టణ కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జర్నలిస్టులకు అక్రిడేషన్, హెల్త్ కార్డు, ఇండ్ల ప్లాట్ల వంటి హక్కులను సాధించేందుకు టిడబ్ల్యూజెఎఫ్ పోరాటం కొనసాగిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారినా జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం విచారకరమని అన్నారు. జర్నలిస్టులు ఐక్యతతో ముందుకు సాగి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. అర్హులైన జర్నలిస్టులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా పాలకులు కృషి చేయాలని కోరారు. ఇటీవల రంగారెడ్డి జిల్లా 3వ మహాసభలను విజయవంతంగా నిర్వహించిన జర్నలిస్టులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహాసభల ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు యూనుస్, బ్లాక్ ప్రధాన కార్యదర్శి నరేష్, గౌరవ అధ్యక్షుడు నర్సింహ్మా, ఉపాధ్యక్షుడు చప్పిడి తిరుపతి, కోశాధికారి యాదగిరి, సభ్యులు తూర్పు శ్రీను, హఫీజ్, శేఖర్, ఇమ్రాన్, ఖలీమ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# "తెలంగాణ రైసింగ్ 2047" లక్ష్యానికి యువత సమిష్టిగా కృషి చేయాలి: జిల్లా కలెక్టర్



**మంచిర్యాల, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణను 2047 నాటికి దేశంలో నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర యువత సమిష్టిగా ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపునిచ్చారు. ఆదివారం బెల్లంపల్లి మండల కేంద్రంలోని ఎఎంసీ మైదానంలో సింగరేణి మందమర్రి ఏరియా ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ ఎ. భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, ఎమ్మెల్యే గడ్డం వినోద్, సింగరేణి సంస్థ డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధి కోసం యువత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న ఆధునిక సాంకేతిక వృత్తి విద్యా కోర్సులను వినియోగించుకోవాలని సూచించారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ద్వారా అనేక కోర్సుల్లో శిక్షణ అందించబడుతోందని, నిరుద్యోగ యువత ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి అవకాశాలను పొందేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వృత్తి విద్యా కోర్సుల ద్వారా స్వయం ఉపాధికి ప్రోత్సాహం కల్పిస్తున్నామని, ప్రైవేట్ సంస్థలతో కలిసి జాబ్ మేళాలు నిర్వహించడం ద్వారా యువతకు ఉపాధి మార్గాలు అందిస్తున్నామని వివరించారు. అనంతరం ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు.

# హుజూరాబాద్‌లో మన్ కీ బాత్ వీక్షణ



**కరీంనగర్, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ 127వ ఎపిసోడ్‌ను హుజురాబాద్ పట్టణంలోని 36వ పోలింగ్ బూత్ వద్ద బీజేపీ అధ్యక్షురాలు తాళ్లపల్లి దేవేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీఎస్టీ స్లాబ్ మార్పుల వల్ల పండుగ సీజన్లో అన్ని వర్గాలకు సంతృప్తి కలిగిందని, దీపావళి సందర్భంగా దేశవ్యాప్తంగా లక్షల కోట్ల వ్యాపార లావాదేవీలు జరిగాయని తెలిపారు. మోదీ ప్రభుత్వం జీఎస్టీని సులభతరం చేయడం వల్లే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. స్వదేశీ వస్తువుల కొనుగోలు ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, ప్రతి ఒక్కరూ ఆ దిశగా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. మన్ కీ బాత్‌లో ఛత్ పండుగ, తెలంగాణ పోరాట యోధులు కొమరం భీమ్, సర్దార్ వల్లభాయ్ పటేల్, గార్బేజ్ కేఫ్, వందేమాతరం 150వ వార్షికోత్సవ అంశాలపై ప్రధాని మోదీ మాట్లాడిన విషయాలను గంగాడి కృష్ణారెడ్డి వివరించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు, జిల్లా కౌన్సిల్ మెంబర్ రావుల వేణు, జిల్లా కార్యవర్గ సభ్యులు గంగిశెట్టి ప్రభాకర్, సీనియర్ నాయకులు తిప్పబత్తిని రాజు, కొలిపాక వెంకటేష్, మునిగంటి నాగరాజు, జంపాల సువర్ణ, తాళ్లపల్లి హరీష్, గుర్రం సంతోష్, తూర్పాటి రాజశేఖర్, మల్లెల సరిత తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లిలో పత్తి కొనుగోలు కేంద్ర ప్రారంభం



**పెద్దపల్లి, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాఘవపూర్ గ్రామంలోని శ్రీరామ జిన్నింగ్ ఇండస్ట్రీస్ వద్ద సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా ప్రారంభించారు. రైతులు దళారీల మోసాలకు గురికాకుండా నేరుగా మద్దతు ధరకు పత్తి విక్రయించేందుకు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. 8 శాతం తేమతో ?8110 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, రుణమాఫీ, ఉచిత బస్సు, ఆరోగ్యశ్రీ, బోనస్ వంటి పథకాలతో ముందుకు సాగుతోందన్నారు. త్వరలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్లు స్వరూప, ప్రకాష్ రావు, జిన్నింగ్ యాజమాన్యం, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలి



**కరీంనగర్, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు నవంబర్ 1లోపు విడుదల చేయాలని బీసీ అజాది స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పంజాల రేవంత్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీఎం ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. విద్యాశాఖ సీఎం వద్ద ఉండి కూడా బకాయిలు విడుదల చేయకపోవడం దారుణమని, విద్యార్థుల చదువుతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని విమర్శించారు. మూడు సంవత్సరాలుగా ఎనిమిది వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, కళాశాలలు బంద్ అవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందాల పోటీలకు నిధులు ఉన్నా, పేద విద్యార్థులకు స్కాలర్షిప్‌లు, రీయింబర్స్మెంట్‌కు నిధులు లేకపోవడం విచారకరమన్నారు. అసెంబ్లీలో ఇచ్చిన హామీని సీఎం రేవంత్ రెడ్డి తప్పారని ఆరోపించారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రముఖులు



**ఎలిగేడు, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మాజీ ఎంపీటీసీ, న్యాయవాది బూర్ల సత్యనారాయణ తారాల కుమార్తె వివాహ వేడుక ఆదివారం కరీంనగర్ ద్వారకమై ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు పెద్దపెల్లి శాసనసభ్యులు విజయ రమణారావు, మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణారెడ్డి, దాసరి మనోహర్ రెడ్డి, హైకోర్టు అడ్వకేట్ బుర్ర వీరస్వామి గౌడ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకకు సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్ రావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు దుగ్యాల సంతోష్ రావు, ఎలిగేడు సింగిల్ విండో మాజీ చైర్మన్ నరహరి సుధాకర్ రెడ్డి, పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకులు గ్యాజంగి లక్ష్మణ్, బీజేపీ జిల్లా కార్యదర్శి గర్రెపల్లి నారాయణస్వామి, తెరాస మండల అధ్యక్షులు బైరెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు రంగు శ్రీనివాస్ గౌడ్, తాటిపల్లి రమేష్ బాబు తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

# యోగా అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక




**కరీంనగర్, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా యోగా అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఎండి కరీం తెలిపారు. తారక హోటల్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో చైర్మన్‌గా సర్దార్ రవీందర్ సింగ్, అధ్యక్షుడిగా నాగిరెడ్డి సిద్ధారెడ్డి, జనరల్ సెక్రటరీగా గుంటి రామకృష్ణ, కోశాధికారిగా పోనుగంటి స్వరూప చారి తదితరులు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు క్రీడాశాఖ, ఒలింపిక్ అసోసియేషన్, తెలంగాణ యోగా అసోసియేషన్ ప్రతినిధులు అబ్జర్వర్లుగా హాజరయ్యారు. యోగా అభివృద్ధికి అందరి సహకారం అవసరమని, త్వరలో కమిటీలను ఏర్పాటు చేస్తామని చైర్మన్ రవీందర్ సింగ్ తెలిపారు.

# రైతు సదస్సు, జాతర అభివృద్ధిపై ఎమ్మెల్యే దృష్టి



**రేగొండ, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో న్యూ శాయంపేట వెలమ భవన్‌లో నిర్వహించిన రైతు సదస్సు, మెగా హెల్త్ క్యాంప్ కార్యక్రమాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ ప్రారంభించారు. రైతుల ఆర్థిక బలోపేతానికి ఆధునిక పద్ధతులు అవసరమని, గ్రామీణ ఆరోగ్య సేవలపై వెలమ సంఘం చేస్తున్న కృషిని ప్రశంసించారు. అనంతరం రేగొండ మండలంలోని తిరుమలగిరి శివారులో జరిగే బుగ్గులోని వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం వంటి సదుపాయాలను మెరుగుపరచాలని, జాతర సమయానికి ముందే పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సహకారంతో జాతరను రాష్ట్ర స్థాయి వేడుకగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

# వడ్ల కుప్పలపై బైక్ పడిపోవడంతో దంపతులకు గాయాలు



**హుస్నాబాద్, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అక్కన్నపేట మండలం బంజారా హిల్స్ తండాలో నడిరోడ్డుపై ఆరబోసిన వడ్ల కుప్పలపై బైక్ పడిపోవడంతో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం ఉదయం బిక్కల్ గ్రామం శివాలి తండాకు చెందిన లకావత్ రవి, ఉమా కరీంనగర్‌కు కూలి పనికి వెళుతుండగా బైక్ వడ్ల కుప్పను ఢీకొని జారిపడింది. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం సిద్దిపేట హాస్పటల్‌కు రిఫర్ చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# ఎల్లమ్మ దేవాలయ నిర్మాణానికి భూమి పూజ



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 26 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
శేరిగూడ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయ నిర్మాణానికి ఆదివారం ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి భూమి పూజ చేశారు.. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద ప్రజలకు ఎన్నో రకాల సంక్షేమ పథకాల ఏర్పాటుతో పాటు, మన పూర్వీకుల ఆచార సంప్రదాయాలకు అనుగుణంగా దేవాలయాల అభివృద్ధి, నూతన ఆలయాల నిర్మాణానికి కృషి చేస్తు న్నదని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఎల్లమ్మ తల్లి భూమి పూజా మహోత్సవ కార్యక్రమం లో గ్రామ పెద్దలు, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ నియోజకవర్గం ప్రజా ప్రతినిధులు , మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండ నియోజకవర్గంలోని 1300 మంది లబ్ధిదారులకు దళిత బంధు నిధులు విడుదల చేయాలి



**నల్లగొండ, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రాష్ట్ర ప్రభుత్వం 1300 మంది దళిత బంధు లబ్ధిదారులకు మూడు లక్షల చొప్పున నల్లగొండ నియోజకవర్గం లో నిధులు మంజూరయ్యాయి నల్గొండ నియోజకవర్గంలోని దళిత బంధువు లబ్ధిదారులకు 3 లక్షల చొప్పున బ్యాంక్ అకౌంట్లు ఓపెన్ చేసి నిధులు మంజూరు చేశారు అట్టి నిధులను ఇవ్వకుండా ప్రభుత్వం నియంత్రిస్తుంది ఈరోజు నల్గొండ పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియంలో దళిత బంధు లబ్ధిదారుల నాలుగు వార్డుల సమావేశం జరిగింది ఈ సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నల్లగొండ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున మాట్లాడుతూ ప్రభుత్వం దళిత బంధు నిధులు విడుదల చేసే వరకు పోరాడుతామన్నారు నవంబర్ 10 తర్వాత మంత్రి క్యాంప్ కార్యాలయం ముందు నిరవధికంగా కూర్చొని దళిత బందు సాధించుకునే వరకు పోరాడదాం అని పిలుపునిచ్చారు నల్గొండ మండలం తిప్పర్తి మండలం కనగల్ మండలం మాడుగులపల్లి మండలంలోని లబ్ధిదారులు 1300 మంది కదిలి రావలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం ప్రతి గ్రామంలో దళిత బంద్ లబ్ధిదారులు సమావేశమై ఈ జరిగే పోరాటంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ గారు మంత్రిగారు స్పందించి నిధులు విడుదల చేసి లబ్ధిదారులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ పట్టణ కార్యదర్శి గాదె నరసింహ దళిత బంధు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే నిజమైన సేవ

-అపర్ణ సీరెనిటీ అపార్ట్‌మెంట్‌లో కమిటీ సభ్యులను అభినందించిన చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
132 జీడిమెట్ల డివిజన్ పరిధిలోని అపర్ణ సీరెనిటీ అపార్ట్‌మెంట్‌లో నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను అభినందిస్తూ, అపార్ట్‌మెంట్ పరిసర ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న శానిటేషన్, స్ట్రీట్ లైట్లు, హార్టికల్చర్ సమస్యలను స్వయంగా పరిశీలించిన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి. నివాసులతో కలిసి సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించి, అసమానంగా పెరిగిన చెట్లు, మెయిన్ రోడ్ పరిస్థితిని పరిశీలించారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు. ప్రజా సమస్యల పరిష్కారమే నిజమైన సేవ అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఎన్. వెంకట రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఉమర్ షేక్, భరత్ రెడ్డి, దివ్య భారతి, నిర్వహణ కమిటీ సభ్యులు శ్రీనివాస్ బూరుగు, డా. టీ. హర్ష, శివ రామకృష్ణ, వి. సురేష్, ప్రియ బాలచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

# గోమాత పరిరక్షణే భవిష్యత్‌కు రక్ష




**హైదరాబాద్, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గోమాత సేవ మత విశ్వాసం కాదు, శాస్త్రీయంగా ప్రకృతి పరిరక్షణకు మార్గమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. నారాయణగూడ కేఎంఐటీ ఇంజనీరింగ్ కాలేజీలో గోసేవా తెలంగాణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన "గోవు పర్యావరణ పరిరక్షణలో శాస్త్రీయ విజ్ఞానం" రాష్ట్రస్థాయి పరీక్షల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గోమాత సేవ ద్వారా పర్యావరణానికి, ప్రకృతికి రక్షణ కలుగుతుందని, గోమయం, గోమూత్రం, పాలు, పెరుగు, నెయ్యి వంటి ఉత్పత్తులు ప్రకృతికి అనుకూలమని వివరించారు. గోమయం పొలాలకు ఎరువుగా, గోమూత్రం సేంద్రీయ పీడకనాశినిగా పనిచేస్తుందని, ఇవి కలిపి జీవామృతంగా ఉపయోగించి రసాయన ఎరువుల అవసరం లేకుండా పంటలు పండించవచ్చని తెలిపారు. విద్యార్థుల్లో భారతీయ జీవన విధానంపై అవగాహన పెంపొందించేందుకు గోమాత సేవను పాఠ్యాంశాల్లో చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో 42 లక్షల పశు సంపద మాత్రమే ఉండగా, అందులో సగం పాలు ఇవ్వనివే అని, హైదరాబాద్ నగరానికి కూడా సరిపడే పాలు లేవని పేర్కొన్నారు. అందుకే ప్యాకెట్ పాలు, పౌడర్ డబ్బాలపై ఆధారపడుతున్నామని, ఈ పరిస్థితి మారాలంటే ప్రతి గ్రామంలో గోశాలలు, ప్రతి పాఠశాలలో గోమాత విలువను నేర్పేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గోవు మతపరమైన అంశం కాదు, అన్ని మతాలకు తల్లి లాంటిదని, ఇస్లాంలోనూ కొందరు మత పెద్దలు గోవును పక్కన పెట్టుకుని నమాజ్ చేసిన దృశ్యాలు ఉన్నాయని గుర్తుచేశారు. గోమాతను కాపాడితే ప్రకృతిని, భవిష్యత్తును, సంస్కృతిని కాపాడినట్లేనని, ఇది మనందరి పవిత్ర బాధ్యతగా పేర్కొన్నారు.

# లయన్స్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం



**కరీంనగర్, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** లయన్స్ డిస్ట్రిక్ట్ 320G సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శాతవాహన విశ్వవిద్యాలయం వద్ద ఉచిత మధుమేహం, రక్తపోటు పరీక్షా శిబిరం నిర్వహించారు. లయన్స్ డయగ్నస్టిక్ అండ్ సీటీ స్కాన్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 80 మంది పాల్గొని ఆరోగ్య సూచనలు పొందారు.గోల్డెన్ శాతవాహన, బాలాజీనగర్, శ్రీనిధి, రాజరాజేశ్వరి, స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్లు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు కలిసి శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. నవంబర్ మధుమేహ అవగాహన నెల సందర్భంగా పట్టణం, గ్రామాల్లో మరిన్ని శిబిరాలు నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ హెచ్. రాజిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా ప్రతినిధులు, క్లబ్ అధ్యక్షులు, ల్యాబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి రిటైర్డ్ అధికారుల సమావేశం




**గోదావరిఖని, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హైదరాబాద్‌లో జరిగిన సింగరేణి రిటైర్డ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షిక సమావేశంలో సీఎంపీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ వంశీధర్, అసిస్టెంట్ కమిషనర్ పి. చిరంజీవి పాల్గొన్నారు. పెన్షనర్లకు డిజిటల్ జీవన్ ప్రమాణ పత్రాలపై అవగాహన కల్పించేందుకు సీఎంపీఎఫ్ సంస్థ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. సింగరేణి మేనేజ్‌మెంట్‌తో ఒప్పందం కుదుర్చుకుని కోల్ బెల్ట్ ప్రాంతాలు, హైదరాబాద్‌లో శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. జీవన్ ప్రమాణ్, ఉమాంగ్ యాప్‌ల ద్వారా లైఫ్ సర్టిఫికేట్ పొందవచ్చని వివరించారు. పెన్షన్ పేమెంట్, వితంతు క్లెయిమ్‌లపై సభ్యుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు.పి. వాసుదేవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెవి దత్తాత్రేయులు, ఇతర ఆఫీస్ బేరర్లు, దాదాపు 200 మంది అధికారులు పాల్గొన్నారు. సీఎంపీఎఫ్ అధికారులకు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఓరుగల్లు గాన కళా వైభవంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**హనుమకొండ, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాళోజీ కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించిన 'ఓరుగల్లు ఘాన కళా వైభవం' కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఐదు గంటల పాటు సాగిన గానామృత యజ్ఞంలో దాదాపు 100కు పైగా పాటలతో కళాకారులు సమాజ హితాన్ని కోరుతూ స్ఫూర్తిదాయకంగా ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ సమయంలో పాట ఉద్యమానికి ఊపునిచ్చిన ఘనత పాటకే చెందిందని, కవులు, కళాకారులు సమాజంలో మార్పు తేవగల శక్తి కలవారని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తక్కువ కాలంలోనే కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభించి కవులకు, కళాకారులకు అంకితం చేశామని తెలిపారు. అదేవిధంగా, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన కల్పించే బృహత్తర కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలో నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని కళాకారులు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బోడ డిన్న, కళాకారులు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ప్రచారంలో పాల్గొన్న వెల్దండ మండల కాంగ్రెస్ నాయకులు



**వెల్దండ, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా ఆదివారం మధురానగర్ ప్రాంతంలో జరిగిన ప్రచార కార్యక్రమంలో వెల్దండ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు చురుకుగా పాల్గొన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు మోతిలాల్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రచారంలో రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌తో కలిసి ప్రజల్లోకి వెళ్లి ఓటు వేయాలని కోరారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే నవీన్ యాదవ్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కాలనీల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, అన్ని విధాలుగా ప్రజలకు మేలు చేస్తుందని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ తాలూకా అధ్యక్షులు పర్వత్ రెడ్డి, రాష్ట్ర మాజీ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి తక్కలపెల్లి శేఖర్, జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షులు కొయ్యల పుల్లయ్య, మండల మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కదారి శ్రీనివాస్ యాదవ్, రాగాయిపల్లి మాజీ సర్పంచ్ రాములు యాదవ్, సీనియర్ నాయకుడు చందు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేసిన బీసీ నాయకులు





**హుజురాబాద్, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కెసి క్యాంపులో మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేసిన బీసీ ఆజాద్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుడికాల భాస్కర్, పద్మశాలి సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ సంగెం సత్యనారాయణ తదితర నాయకులు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.న్యాయస్థానంలో బీసీలకు అనుకూల తీర్పు రావాలంటే ప్రభుత్వం, విపక్షాలు చిత్తశుద్ధితో మద్దతు ఇవ్వాలని, రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చి బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. గ్రామ స్వరాజ్యం సాధనకు బీసీలకు రాజ్యాధికారంలో న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.ఈ వినూత్న కార్యక్రమంలో ఇప్పకాయల సాగర్, పంజాల రేవంత్, వ్యాసబట్టు మధుసూదన్ రాజు, జినుకల లక్ష్మణ్ రావు, గజవెల్లి మనోహర్, క్యాతం మహేందర్, జూపాక శివమణి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీనివాసుల సేవా సంస్థ రెండవ వార్షికోత్సవం



**కరీంనగర్, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ రెండవ వార్షికోత్సవం 2500 మంది శ్రీనివాస మిత్రులతో ఒకే వేదికపై విజయవంతంగా నిర్వహించారు. శ్రీ శ్రీనివాసరెడ్డి వూట్కూరి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆత్మీయ సమ్మేళనంలో 300 మందికి పైగా తలసేమియా బాధిత పిల్లల కోసం రక్తదానం చేశారు.ఈ సేవా కార్యక్రమానికి వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ గుర్తింపు లభించింది. సంస్థతో పాటు పాల్గొన్న ప్రతి శ్రీనివాస మిత్రునికి, రక్తదానం చేసిన వారికి ప్రత్యేకంగా రికార్డ్ సర్టిఫికెట్ అందజేశారు. సభకు చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సురేష్ ఆత్మారాం, తాటిచెర్ల హరికిషన్ శర్మ, ఎనగందుల శ్రీనివాస్, రికార్డ్ డైరెక్టర్ రామ ప్రకాష్ తదితరులు హాజరయ్యారు.పివిఆర్ ఫంక్షన్ హాల్ ప్రొప్రైటర్ ఈశ్వరరావు, విజయ్, గట్టు శ్రీనివాస్, పడకంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో "సేవే మా లక్ష్యం – సేవే మా మార్గం" నినాదంతో కార్యక్రమం నిర్వహించారు. ధర్మరక్షణ, విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు, సన్మానాలు, ఆలయ దర్శనాలు, ఆధ్యాత్మిక చింతన వంటి పలు సేవా కార్యక్రమాలు సంస్థ ద్వారా ఇప్పటివరకు నిర్వహించబడినట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఆధునిక స్ట్రీట్ లైటింగ్ ప్రాజెక్ట్ ప్రారంభం



**రామగుండం, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రామగుండం నియోజకవర్గ ప్రజల అభ్యున్నతికి నిరంతరంగా కృషి చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్న శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాగూర్ ఈరోజు గోదావరిఖని కళ్యాణ్ నగర్ నుండి ఉల్లిగడ్డల బజార్ వరకు ఆధునిక స్ట్రీట్ లైటింగ్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. 22 లక్షల టి.యు.ఎఫ్.ఐ.డి నిధులతో అమలు చేస్తున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా రాత్రి వేళల్లో ప్రజలకు సురక్షిత రాకపోకలు సాగించేందుకు అనుకూల వాతావరణం ఏర్పడనుంది. అలాగే, ఈ ప్రాంతం వెలుగులతో మెరిసిపోతూ పట్టణ అభివృద్ధికి కొత్త శకాన్ని తెరుస్తుందని భావిస్తున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ మాట్లాడుతూ, ప్రజల సౌకర్యం, ప్రాంతీయ అభివృద్ధి తమ ప్రాధాన్యత అని, ప్రతి వాడ, ప్రతి వీధి వెలుగులతో నిండిపోవాలని ఆకాంక్షించారు. రామగుండం నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# అర్బన్ బ్యాంక్ ఎన్నికలకు కాంగ్రెస్ ప్యానల్ ప్రకటించలేదు



**కరీంనగర్, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంక్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ తరపున ఎలాంటి ప్యానల్ ప్రకటించలేదని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. తమకే మంత్రుల అండదండ ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని, అది అసత్యమని పేర్కొన్నారు.హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు, ఇతర నేతలతో చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బ్యాంకు అభివృద్ధికి ప్రభుత్వం సహకరిస్తుందని, కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.ఎన్నికల బరిలో ఉన్నవారిలో ఎక్కువమంది కాంగ్రెస్ పార్టీకి చెందినవారేనని, పాలకవర్గాన్ని ఏర్పాటు చేసే అవకాశం కాంగ్రెస్‌కే ఉందన్నారు. బ్యాంకు చరిత్రలో ఎక్కువకాలం పాలన సాగించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందని, ఈసారి కూడా విజయం సాధించేది కాంగ్రెస్ పార్టీనే అని పేర్కొన్నారు. వినియోగదారుల అభిప్రాయాలతో నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేసి, కార్పోరేట్ స్థాయిలో సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

# బైక్ పై 29 వేల రూపాయల చాలన్ - సీజ్



**కరీంనగర్, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. శనివారం సాయంత్రం కమాన్ ప్రాంతంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో గణేష్ నగర్‌కు చెందిన కట్కోజువాల కిరణ్ కుమార్ నడుపుతున్న హోండా షైన్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.ఈ బైక్‌పై 120 ట్రాఫిక్ చలాన్లు పెండింగ్‌లో ఉండగా, రూ. 29,560 జరిమానా బకాయి ఉన్నట్లు గుర్తించారు. రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్న సమయంలో బైక్‌ను పట్టుకున్నట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు. వాహనాన్ని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించి తదుపరి చర్యలు చేపట్టారు.చలాన్లు చెల్లించకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పోలీసులు హెచ్చరించారు.

# బెల్లంపల్లిలో క్రికెట్ విజేతలకు బహుమతులు




**బెల్లంపల్లి, అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాసిపేట మండలంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ బహుమతి ప్రదాన కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పాల్గొన్నారు. విజేత జట్టుకు బహుమతులు స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ, యువత సమాజ భవిష్యత్తు అని, క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, టీమ్ స్పిరిట్ పెరుగుతాయని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ, ప్రాంత యువత క్రీడల పట్ల చూపుతున్న ఆసక్తి ప్రశంసనీయం అని, క్రీడల ద్వారా సామాజిక సమైక్యత, స్నేహబంధం బలపడుతుందని పేర్కొన్నారు.

## మహిమాన్వితం కందగిరి క్షేత్రంకందికొండ లక్ష్మీనరసింహుడి జాతర

### ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్



**కురవి , అక్టోబర్ 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్ :** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కందికొండ గ్రామ శివారులోని కందగిరి పర్వత శిఖరంపై లక్ష్మీనరసింహస్వామి జాతర జరగనుంది. ఏటా కార్తీక పౌర్ణమి రోజున జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఆదివారం లక్ష్మి నరసింహ స్వామి జాతర పనులను ప్రభుత్వ విప్. డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ పరిశీలించారు. కందగిరి పర్వత శిఖరంపై అఖండ దీపం, స్వామివారి కల్యాణానికి ఏర్పాట్లు ప్రకృతి రమణీయతకు నెలవు జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. కందగిరి లక్ష్మీనరసింహస్వామి మహిమాన్వితుడిగా.. కోరిన కోరెలు తీర్చే దేవదేవుడిగా భక్తుల పూజలందుకుంటున్నాడు. కురవి మండలకేంద్రం నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో కందగిరి పర్వతం ఉంటుంది ప్రభుత్వ విప్. డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ తెలిపారు.